నవతెలంగాణ
1
మహబూబ్‌నగర్
గురువారం | ఫిబ్రవరి 1, 2024 | www.navatelangana.com

ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల తనిఖీ చేపట్టాలి

• ఎన్నికల అదనపు ప్రధాన కార్యదర్శి లోకేష్ కుమార్



మహబూబ్ నగర్ : రానున్న పార్లమెంట్ ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల మొదటి విడత తనిఖీని ఫిబ్రవరి 5 నుంచి చేపట్టాలని రాష్ట్ర ఎన్నికల అద నపు ప్రధాన అధికారి లోకేష్ కుమార్ సూచించారు. ఈవీఎంల మొదటి విడత తనిఖీ పై బుధవారం ఆయన హైద రాబాద్ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో గూగుల్ మీట్ నిర్వహి ంచారు. ఈ సందర్భంగా ఫిబ్రవరి 5 నుంచి చేపట్టనున్న ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల మొదటి విడత తనిఖీ సందర్భంగా తనిఖీకి ఎంపిక చేయాల్సిన ఈవీఎంలు, వాటి వినియోగం తదితర అంశాలపై సూచనలు, సలహాలను ఇచ్చారు. గతంలో మాదిరిగానే ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఈవీఎంల మొదటి విడత ఎఫ్ఎల్‌సీని నిర్వహించాల్సిందిగా తెలిపారు. కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి జీ. రవి నాయక్ ఈ గూగుల్ మీట్‌కు జిల్లా నుంచి హాజరయ్యారు .

నూతన గ్రామ పంచాయతీ భవనం ప్రారంభం



బాలానగర్ : బాలానగర్ మండలంలోని పెద్దరేవెల్లి గ్రామంలో రూ.20 లక్షల వ్యయంతో నిర్మించిన నూతన పంచాయతీ భవనాన్ని జడ్చర్ల శాసనసభ్యులు జనంపల్లి అనిరుద్ రెడ్డి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ ప్రతి గ్రామ పంచాయతీలో సొంతభవనాలు ఉండాలని, అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయని సొంత భవనాల నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. సర్పంచ్ నర్మదా లింగా రెడ్డి నిర్మించారు. సలదాత ఆది రమణారెడ్డి , రాజశేఖర్ రెడ్డి ,ఆయన వెంబడి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శంకర నాయక్ మాజీ అధ్యక్షులు ఆది రమణ రెడ్డి సీనియర్ కాంగ్రెస్ నాయకులు సాదు వెంకట్ రెడ్డి. వెంకటేశ్వర రెడ్డి, నందమూరి దత్తాత్రేయ.వెంకట్ నాయక్, హరి సింగ్ నాయక్, సర్పంచులు,ఎంపీటీసీలు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



కార్పోరేట్ విధానాలను ప్రతిఘటిద్దాం

• సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి టీ. సత్తయ్య

జడ్చర్ల : కార్పోరేట్ విధానాలను ప్రతిఘటిద్దాం అని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి టీ. సత్తయ్య అన్నారు. బుధవారం 16న దేశవ్యాప్త సమ్మె సమ్మె నోటీసులు స్థానిక ఎంపీడీవో ఆఫీసులో పీహెచ్ సెంటర్ కవేరంపేట ఎస్డబ్ల్యుసి గోడౌన్లో ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రైతాంగ, కార్మిక వర్గ ప్రజల సమస్యలను పరిష్కరించడంలో విఫలమైందని,పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను రద్దుచేసి వాటి స్థానంలో నాలుగు లేబర్ కోడ్ లు తెచ్చిందని, సమ్మె హక్కులను కాలరాస్తున్నదని అన్నారు. పీఎఫ్, ఈఎస్ఐ వెల్ఫేర్ బోర్డులను నిర్వీర్యం చేస్తున్నది తిరిగి 12 గంటల పని విధానం అమల్లోకి తెస్తున్నదని, కాంట్రాక్టు లేబర్ విధానం అని రంగాల్లో మరింత పెంచి శ్రమ దోపిడీకి గురిచేస్తున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. కనీస వేతనం రూ.26 వేలు నిర్ణయించేందుకు బీజేపీ ప్రభుత్వం ఒప్పుకోవడం లేదన్నారు. సీపీఎఫ్‌ను రద్దుచేసి పాత పెన్షన్ ఓపీఎస్ పున రుద్ధరణను వ్యతిరేకిస్తున్నదని, కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు 8వ పే కమిషన్ నియమించకుండా జాప్యం చేస్తున్న దని వాపోయారు.ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సీనియర్ నాయకులు భాగి కృష్ణయ్య, ఎండీ పాషా, శేఖర్ రెడ్డి ,బాలనాగయ్య హమాలీలు దశరథం ఎల్లయ్య, వెంకటేశ్ ,శ్రీను, మాసయ్య పురుషోత్తం, శ్రీనివాస్, మల్లేష్ ,జంగయ్య పాల్గొన్నారు.

దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయండి..



కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, కర్షక, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ దేశవ్యాప్తంగా ఫిబ్రవరి 16న జరిగే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని జడ్చర్ల మండలంలోని మల్లెబోయినపల్లి గ్రామంలో.. వ్యవసాయ కార్మిక సంఘం.. ఆధ్వర్యంలో కరపత్రాలు పంచుతూ ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ వెంకట్రాములు పాల్గొని మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి ప్రభుత్వం రెండవసారి అధికారంలోకి వచ్చిన నాటి నుంచి రైతులను వ్యవసా య కూలీలను కార్మికులను అనేక రకాలుగా వారి హక్కులను కాలరాస్తూ వారి శ్రమను నిర్వీర్యం చేస్తున్నదని, అందులో భాగంగా నే ఫిబ్ర వరి 16 న రైతు, సీఐటీయూ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో సమ్మెను చేపట్టా మని, ఈ సమ్మెలో రైతులు. వ్యవసాయ కూలీలు. కార్మికులు. నిరుద్యోగులు. పేదలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. అనంతరం వ్యవసా య కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు పి జగన్, కడియాల మోహన్ మాట్లాడుతూ కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం ఉపాధి హామీ పథకాన్ని ఎత్తివేసే కుట్రలో భాగంగా డ్రోన్ సిస్టం తీసుకువచ్చిందని, దేశ వ్యాప్తంగా మెజార్టీగా జాబ్ కార్డులను తొలగించి ఉపాధికి దూరం చేసే కుట్ర పన్నుతుందని అన్నారు.కార్మికులకు సంబంధించిన చట్టాలను తుంగలో తొక్కేసి యజమానులకు అనుకూలంగా చట్టాలను తయారు చేసిందని విమర్శించారు. కార్యక్రమంలో శివ లీల ,ఆం డాలు, హనుమంతు,పాండు,ఈర్లపల్లియాదయ్య ,వెంకటేష్, భగవంతు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

• టీఎస్‌యూటీఎఫ్



మహమ్మదాబాద్ : ఉపాధ్యాయుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని టీఎస్‌యూటీఎఫ్ మండల అధ్యక్షుడు ఎస్ వెంకటయ్య అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని సీపీఎస్ నెంబర్ 2 పాఠశాలలో మండల స్థాయి సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. ఉపాధ్యాయుల న్యాయమైన సమస్యలను పరిష్కరించే విధంగా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ప్రాథమిక ఉన్నత పాఠశాలల పని వేలలు ఇంతకు ముందులాగా ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4:15 గంటల వరకు మార్చాలన్నారు. అనంతరం యూటీఎఫ్ మండల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షునిగా ఎస్ వెంకటయ్య, ప్రధాన కార్యదర్శిగా సాయన్న, ఉపాధ్యక్షులుగా డీ.గౌరమ్మ, కోశాధికారిగా వెంక టేష్ లను ఎన్నుకున్నారు.ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్య దర్శి రవికుమార్, వికారాబాద్ జిల్లా యూటీఎఫ్ కార్యదర్శి ఎండీ సలీం, ఎం సత్యనా రాయణ,గండీడ్ మండల అధ్యక్షుడు గంట శ్రీనివాస్ పాల్గొన్నారు.

బాధ్యతతో చదవాలి..

• పీయూ హెచ్ ఓడీ అర్జున్ కుమార్

మహబూబ్‌నగర్ : బ్యాచిలర్ విద్యా చదవడానికి వచ్చిన విద్యార్థులందరూ బాధ్యతతో చదవాలని పాలమూరు యూనివర్సిటీ ఎంబీఏ శాఖ హెచ్ ఓ డీ అర్జున్ కుమార్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని స్టే మేరీస్ బీఈడీ కళాశాల నూతన విద్యార్థుల స్వాగత వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వందలాదిమంది విద్యార్థులకు విద్యా బోధన బోధించేందుకు శిక్షణ కళాశాలలో చేరిన ప్రతి విద్యార్థి పై ఎంతో బాధ్యత ఉంటుందన్నారు. ఒక్క సబ్జెక్టు చదువుతే ఉత్తమ గురువులు కాలేరని స్థానిక ప్రాంతాన్ని మొదలుకొని ప్రపంచంలో జరిగే ప్రతి విషయాన్ని విశ్లేషంగా చదివి అర్థం చేసుకోవాలని గుర్తు చేశారు. అనంతరం వాగ్దేవి జూనియర్ కళాశాల కరస్పాండెంట్ విజేత వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ నీవు చేసే పని పట్టుదలతో విశ్వాసంతో పనిచేసి సమాజానికి గుర్తింపు తెచ్చే వ్యక్తులను సెలబ్రిటీస్‌గా ఈ సమాజం గుర్తిస్తుందన్నారు. కాలాని సమయాన్ని విద్యార్థులు ఎవరు వృధా చేయొద్దని, అందరూ మెచ్చుకునే విధంగా మనని గుర్తు పెట్టుకునే విధంగా పరిశోధనలు చదువులు సాగాలని అన్నారు. మన కుటుంబంలో తాతా ముత్తాతలు మనకు తెలియదని కానీ ఒక అబ్దుల్ కలాం స్వాతంత్ర సమరోధులను ఇప్పటికీ మన సమాజం గుర్తు పెట్టుకోవడానికి వాళ్ళు ఒక సెలబ్రిటీలు అయినారని అన్నారు. నాలుగు గోడల మధ్య చదివే ప్రతి విద్యార్థి ఒక సెలబ్రిటీ కావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పాలమూరు విశ్వవిద్యాలయం ప్రిన్సిపాల్ బషీర్ అహ్మద్, వెన్నెల శ్రీ ఫౌండేషన్ స్థాపకులు శివకుమార్,కళాశాల కరస్పాండెంట్ జయంతి, జయ కుమార్ వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.



రాజకీయ 'చదరంగం'

• ఎన్నికలప్పుడే పాదయాత్రలు
• పదేళ్లపాటు ప్రజల మోహం చూడని నాయకులు
• ఇప్పుడు ప్రజల ముందుకు వచ్చి హామీల వర్షం



నవతెలంగాణ - మహబూబ్‌నగర్ ప్రాంతీయ ప్రతినిధి

ఎన్నికలు అనగానే రాజకీయ నాయకులకు ప్రజలు పాదయాత్రలు గుర్తుకు వస్తాయి. 10 ఏళ్లపాటు ప్రజల మోహం చూడని నాయకులు ప్రజల ముందుకు వస్తున్నారు. ముఖ్యంగా ఉమ్మడి జిల్లాలో పలు రాజకీయ పార్టీలు పార్లమెంటు ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని ప్రజల ప్రదక్షణం కోసం పడరాని పాట్లు పడుతున్నారు. ఇక గుళ్ల గోపురాలే కాదు.. ఆటలు, ఉత్సవాలలో సైతం వీరు క్రియాశీలకంగా పాల్గొంటున్నారు. ఎన్నికల తర్వాత ప్రజలకు కనబడకుండా పోవడం ఖయం అని పలువురు రాజకీయ విశ్లేషకులు బావిస్తున్నారు. మూడు నెలల పాటు శాసనసభ ఎన్నికల కోసం పలు పార్టీల నాయకుల ప్రచారంతో గ్రామాలు, పల్లెలు ప్రచారంతో హోరెత్తింది. ముఖ్యంగా టీఆర్ఎస్, బీజేపీలు అయితే పాదయాత్రలు చేశారు. బీఆర్ఎస్ నాయకులు చేసిన అభివృద్ధిని వల్లె వేస్తూ..నియోజకవర్గాలు కలియ తిరిగారు. పాలమూరులో బీజేపీ మాజీ అధ్యక్షులు బండి సంజయ్ పాదయాత్ర నిర్వహించారు. ఇక నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే మర్రి జనార్ధన్‌రెడ్డి, మంత్రి నీరంజన్‌రెడ్డి, శ్రీనివాస్‌గైడ్‌లు సైతం అనేక రూపాలలో పాయాత్రలు చేశారు. ఎన్నికల్లో ఇవేవి పనిచేయలేదు. గతంలో ఉన్న అధికార పార్టీని ఓడించి ప్రజలు కాంగ్రెస్‌కు పట్టం కట్టారు. ఫిబ్రవరి మధ్యస్థంలో పార్లమెంటు ఎన్నికలకు నోటిఫికేషన్ వెలువడే అవకాశాలు ఉన్నాయి. దీంతో మళ్లి రాజకీయం వేడెక్కింది. బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీలు ప్రజలను ప్రసన్నం చేసుకోవడానికి పడరాని పాట్లు పడుతున్నారు. పదేళ్లపాటు ప్రజలకు దూరంగా ఢిల్లీకి పరిమితమైన నాయకులు పాదయాత్రలు మొదలు పెడుతున్నారు. ముఖ్యంగా పాలమూరు పార్లమెంటు అభ్యర్థిగా కాంగ్రెస్ నుంచి బరిలో ఉంటున్న మాజీ ఎమ్మెల్యే చల్లా వంశీచంద్‌రెడ్డి మక్తల్ నుంచి పాదయాత్ర మొదలు పెట్టారు. డిల్లీలో రాహుల్ గాంధీ దగ్గర అత్యంత సన్నిహితుడిగా ఉండి పాలమూరు నియోజకవర్గాన్ని ఏమాత్రం పట్టించుకోలేదు. 2019లో కల్వకుర్తి ఎమ్మెల్యేగా మహబూబ్‌నగర్ ఎంపీగా ఓడిన తర్వాత కనుమరుగైన వంశీచంద్‌రెడ్డి ఇప్పుడు ప్రజల మధ్యకు వచ్చారు. బీజేపి నాయకులు సైతం ప్రచారంలో ఉంటున్నారు. ముఖ్యంగా మహబూబ్‌నగర్ పార్లమెంటు బరిలో ఉండాలని మాజీ మంత్రి డీకే. అరుణ, మాజీ ఎంపీ జితెందర్‌రెడ్డి, బీజేపీ కోశాధికారి శాంతికుమార్ పోటీ పడుతున్నారు. విస్తృతంగా పర్యటి స్తున్నారు. ఒకరిపై మరొకరు రాజకీయ విమర్శలు చేస్తున్నారు. బీఆర్ఎస్ ఇప్పటి వరకు అభ్యర్థులను ప్రకటించలేదు. ముఖ్యంగా ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యే లక్ష్మారెడ్డిలలో ఎవరో ఒకరికి టికెట్ ఇచ్చే అవకాశాలు ఉన్నాయి. మొన్న శాసన సభ ఎన్నికల్లో ఓటిమిపాలు కావడంతో పార్లమెంటు ఎన్నికల్లో పోటీ చేయ డానికి ఎవరూ.. ముందుకురావడంలేదు. మరోవారం రోజుల్లో నోటిఫికేషన్ వస్తుందనేప్రచారం ఊపందుకోవడంతో రాజకీయ పార్టీల కదలిక మొదలయ్యింది.

విద్యార్థులు చదువులో ముందుండాలి : ఎమ్మెల్యే

నవ తెలంగాణ - మహబూబ్ నగర్



ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు చదువులో ముందుండాలని స్థానిక ఎమ్మెల్యే శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మిగతా వాళ్ళందరితో కూడా సమాన సదుపాయాలు వాళ్లకు ఉండాలనే ఉద్దేశంతో ఈ డిజిటల్ కంటెంట్ స్టడీ మెటీరియల్స్ అందిస్తున్నట్టు తెలిపారు.బుధవారం విద్యా యాత్రలో భాగంగా మాడల్ బేసిక్ ఉన్నత పాఠశాల, గాంధీ రోడ్డు ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమాలలో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. హైదరాబాద్ లాంటి మహా నగరాల మాదిరిగా అంత సదుపాయాలు ఇక్కడ ఉండవని, సదుపాయాలు లేక మన విద్యార్థులు వెనుక పడకూడదు అన్న ఉద్దేశంతో దేశం లో ఎవ్వరికీ లేని సదుపాయాన్ని మీకు కల్పిస్తున్నామని చెప్పారు. వాస్తవంగా తెలంగాణ రాష్ట్రంలో నేనిచ్చే బుక్స్ ఈ డిజిటల్ కంటెంట్ మార్కెట్లో కూడా లభ్యం కావని, ప్రభుత్వ స్కూల్ పిల్లలకు మాత్రమే అందిస్తున్నట్టు పేర్కొన్నారు. నన్ను అడుగుతే ఎవరైనా ప్రైవేట్ స్కూల్ పిల్లలకు మా సంస్థల తరఫున మా ఎన్జీవోస్ తరఫున ఉచితంగా పంపిణీ చేయడం జరుగు తుందని చెప్పారు. ఇప్పుడు ఎవరి దగ్గర లేని ఆయుధం మీ దగ్గరకు వచ్చిందని,దీన్ని బాగా వాడుకోవాలని మిగతా విషయాలపై ఆలోచించకండి అని చెప్పారు.ఈ నలభై రోజులు మనసు పెట్టి కష్టపడితే మీకు వచ్చే మార్కులతో మీకు మంచి కాలేజీలో అడ్మిషన్ దొరుకుతాయనిచెప్పారు. మా రు తున్న కాలంలో మీరందరూ కూడా ఎవ రికి ఇష్టమైన స్కిల్‌ను వారు నేర్చుకోవాలని, ఎలక్ట్రి కల్, కంప్యూ టర్స్ లేదా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రకరకాల పద్ధతుల్లో స్కిల్స్ అందుబాటులో ఉన్నాయన్నారు. మేమందరం కూడా మీ గురించి ఆలోచిస్తూ ఉన్నాం, స్కూల్స్, కాలేజీలలో గాని ఎక్కడ ఏ సమస్య ఉన్నా సరే ముఖ్యంగా మన మహబూబ్ నగర్ నియోజకవర్గంలో నేనే వ్యక్తి గతంగా పరిశీలించి ఆ సమస్యను పరిశీలిస్తానని హామీ ఇచ్చారు. లైబ్రరీ లేక పోతే అది పాఠశాల కాదు అని, ప్రతి పాఠశాలలో లైబ్రరీ ఏర్పాటు కోసం నా నిధుల నుంచి ఒక లక్ష రూపాయల నిధులను అందిస్తానని చెప్పారు.ప్రతి హాస్టల్ లో విధిగా తెలు గు, ఇంగ్లీష్ పేపర్లు రెండు అందుబాటులో ఉండే ందుకు చర్యలు తీసుకోవాలని డీఈఓని ఆదేశి ంచారు. మీరు ఒక అరగంట న్యూస్ పేపర్ చదవాలని, ఆటోమేటిక్గా మీకు అన్ని విషయాలు తెలు స్తాయని, చదువు ఎలాగో మీరు చదువుతారని, కానీ న్యూస్ పేపర్ చదివితే మీకు ప్రపంచంలో ఏం జరుగుతోంది దేశంలో ఏం జరుగుతోంది, రాష్ట్రంలో ఏం జరుగుతోంది తెలుస్తొ ందని అన్నారు. బుక్ రీడింగ్ వన్ ఆఫ్ ద మోస్ట్ ఇంపార్టెంట్ ఫాక్టర్" పుస్తకం చదివే ఓపిక మీకు వచ్చింది అంటే అర్థం చేసుకునే శక్తి దానంతట అదే పెరుగుతుందని, ఏ పుస్తకం చదివిన పరవాలేదు స్టోరీ బుక్ చదివిన పర్వాలేదు కూడా కానీ రీడింగ్ హాబిట్ అనేది మెల్లగా మెల్లగా రీడింగ్ హాబిట్ అనేది పెంచు కోవాలన్నారు. 40 రోజు ల పాటు పూర్తిగా స్టడీస్ మీద కాన్సెంట్రేట్ చేసేవిధంగా తల్లిదండ్రులకు కూడా శ్రద్ధ తీసుకోవాలని చెప్పారు . విద్యార్థుల తల్లిదండ్రులు కూడా పిల్లల భవిష్యత్తు దృష్టి లో ఉంచుకొని వారి కి మంచి వాతావరణాన్ని అందించాల్సిన బాధ్యత తల్లిదండ్రులదేనన్నారు. ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించిన అందరినీ పేరు పేరు నా అభినందించారు.అంతకుముందు డిజిటల్ కంటెంట్ స్టడీ మెటీరియల్స్ ఉపయోగించే విధానాన్ని విద్యార్థులకు వారి తల్లిదండ్రులకు స్వయంగా ఎమ్మెల్యే వివరించారు. ఈ రోజు మాడల్ బేసిక్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు, పోలీసు లైన్ విద్యార్థులకు 260 విద్యార్థులకు, గాంధీ రోడ్డు ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో 257 మంది విద్యార్థులకు డిజిటల్ కంటెంట్ స్టడీ మెటీరియల్స్ (గణితం, సైన్స్, బయోలాజికల్ సైన్స్, సోషల్ స్టడీస్) తల్లిదండ్రులతో కలిసి ఉచితంగా అందించారు. చిన్నారుల చేత జరిగిన సాంస్కృతిక కార్యక్రమాలు అతిథులను అలరించాయి. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాధికారిరవీందర్, డిపిఆర్ఓ వెంకటేశ్వర్లు, పాఠశాల ప్రధానో పాధ్యా యుడు, ఎం ఎం బాసిత్, కౌన్సిలర్ శ్రీ రషీద్, గాంధీ రోడ్డు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జగదీశ్వర చారి, దుంకుడు శ్రీనివాస్, ఎంఇఓ శ్రీమతి జయశ్రీ, గంజి శ్రీనివాస్, పాఠశాల, రాంనగర్, మార్కెట్ లైన్, ముమ్మినివాడి, కుమ్మరి వాడి, టిడిగుట్ట, వీరన్న పేట, మదీనా మజీద్, పాఠశాల ల ప్రధాన ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పార్టీలకు అతీతంగా గ్రామాభివృద్ధి

• సర్పంచ్ సుమతమ్మ గోపాల్ రెడ్డి



మిడ్జిల్ : ప్రజలందరి సహకారంతో పార్టీలకతీతగా గ్రామాన్ని అభివృద్ధి చేశామని సర్పంచ్ సుమతమ్మ గోపాల్ రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని మసిగుండ్లపల్లి గ్రామపంచాయతీ సర్పంచ్ వార్డు మెంబర్లకు ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. గత ఐదు సంవత్సరాల నుంచి జడ్చర్ల మాజీ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి గ్రామాభివద్ధికి ఎంతో కృషి చేశారని, ప్రజలు మాపై నమ్మకాన్ని ఉంచి సర్పంచిగా గెలిపించినందుకు ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా గ్రామంలోని అన్ని వార్డులు అభివృద్ధి చేశామని తెలిపారు. సీసీ రోడ్లు, అండర్ డ్రైనేజీలు, స్మశాన వాటిక, నూతన పాఠశాల, కాంపౌండ్ వాళ్లు ఎన్నో లక్షల రూపాయలతోటి పనులు చేశామని తెలిపారు.మాజీ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి గ్రామాభివృద్ధికి ఎంతో కృషి చేశారని .ఆయన కృషి ఏప్పటికీ మర్చిపోలేనిదని తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాల కంటే మసిగుండ్లపల్లి గ్రామానికి ఎంతో ప్రాధాన్యతతో పాటు అత్యధికంగా నిధులు మంజూరు చేశారన్నారు. గ్రామపంచాయతీ వార్డు మెంబర్లు , సిబ్బంది పంచాయతీ కార్యదర్శి గ్రామ అభివృద్ధిలో పాలుపం చుకున్నారని తెలిపారు. ఐదు సంవత్సరాలుగా సహకరించినందుకు గ్రామపంచాయతీ తరఫున అధికారులకు, ప్రజాప్రతినిధులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ మథిన్, పంచాయతీ కార్యదర్శి వెంకటేష్, వార్డు మెంబర్లు తదితరులు పాల్గొన్నారు.

రైతన్నల బిజీ బిజీ.



బాలానగర్ : ఈ సంవత్సరం చెరువులలో నీరు ఉన్నందున బోరు బావులలో నీటిమట్టం పెరగడంతో రైతులు రబీ సీజన్లో వరి మొక్కజొన్న తదిత కూరగాయల పంటలు సాగు చేస్తూ..రైతులు బీజీ బిజీగా మారారు. బోరుబావులలో నీరు ఉన్నందున ఎక్కువగా వరికి ప్రాధాన్యత ఇస్తున్నారు. హారిక పంటలను వేయలేకపోతున్నారు ఎందుకనగా హారితాది పంటలు సాగు చేస్తే అడవి పందులకు సరిపోమని , ఎక్కువగా రైతులు బోరుబావుల కింద వరి నాట్లు వేసుకుంటున్నారు.

కాలుష్య నియంత్రణ బోర్డు ఆదేశాలు అమలు చేయాలి

• చింతనూర్ ఇథనాల్ కంపెనీ వ్యతిరేక పోరాట కమిటీ నాయకులు

నవ తెలంగాణ - మహబూబ్ నగర్



చింతనూర్ ఇండనల్ కంపెనీ పై కాలుష్య నియంత్రణ బోర్డు ఇచ్చిన ఆదేశాలను తక్షణమే అమలు చేయాలని చింతనూర్ ఇథనాల్ కంపెనీ వ్యతిరేక పోరాట కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలోని టీ.ఎఫ్.టీ.యూ కార్యాలయంలో చిత్తనూరు ఇథనాల్ కంపెనీ వ్యతిరేక పోరాట కమిటీ సంఘాల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ అక్టోబర్ 22న రైతులపై పోలీసులు జరిపిన లాఠీ చార్జ్ ను తీవ్రంగా ఖండిస్తున్నామని, కుట్రపూరితంగా జరిపిన ఆ లాఠీచార్జిలో గాయపడిన రైతుల కుటుంబాలకు, గాయపడి మరణించిన మహమ్మద్ ఖాసీం కుటుంబానికి సానుభూతి తెలిపారు. లాటి చార్జ్ తదనంతరం 78 మందిపై అక్రమ కేసులు పెట్టి చిత్రహింసలకు గురిచేసి, చట్ట వ్యతిరేకంగా వ్యవహరించిన పోలీసు అధికారులపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పోలీసులు జరిపిన అక్రమ లాఠీఛార్జ్ పై సిట్టింగ్ జడ్జ్ చేత విచారణ జరిపించాలని,చిత్తనూరు ఇథనాల్ కంపెనీ కి కాలుష్య నియంత్రణ మండలి నెలరోజుల కిందట ఇచ్చిన ఆదేశాలనుఅమలు చేయాలని కోరారు. రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి ఆదేశాల అమలు కోసం చిత్తనూరు ఇథనాల్ కంపెనీ వ్యతిరేక పోరాట కమిటీ భవిష్యత్‌లో చేపట్టబోయె కార్యక్రమాలలో ప్రజలు పాల్గొ నాలనివిజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో పాలమూరు అధ్యయన వేదిక ఉమ్మడి జిల్లా కన్వీనర్ ఎం. రాఘవాచారి, నారయణపేట జిల్లా కన్వీనర్ ఎం. వెంకట్రాములు, టీ.ఎఫ్.టీ.యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్ఎం ఖలీల్, కుల అసమానతల నిర్మూ లన పోరాట సమితి ఆల్ ఇండియా కన్వీనర్ బండారి లక్ష్మయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జే చక్ర వర్తి, కుల నిర్మూలన పోరాట సమితి ఉమ్మడి జిల్లా అధ్యక్షులు డి చంద్రశేఖర్, టీ.ఎఫ్.టీ.యూ జిల్లా ప్రధాన కార్యదర్శి డా.పి యాదగిరి, తెలంగాణ ప్రజా ఫ్రంట్ రాష్ట్ర కన్వీనర్ నాగభూషణం, టీ. ఎఫ్.టీ. యూ నాయకులు జలీల్‌పాష తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థి భవిష్యత్ పునాధి

• ఇంటర్మీడియట్ విద్యాధికారి డాక్టర్ శ్రీధర్ సుమన్



మిడ్జిల్ : ఇంటర్మీడియట్ విద్య విద్యార్థుల భవిష్యత్‌కు పునాధి అని అధ్యాపకులు చెప్పే ప్రాణాలు క్రమశిక్షణతో శ్రద్ధతో వింటే భవిష్యత్‌లో విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరుకుంటారని ఇంటర్మీడియట్ జిల్లా అధికారి శ్రీధర్ సుమన్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని జూనియర్ కళాశాలలో కళాశాల వార్షికోత్స కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వ కళాశాలలోనే నాణ్యమైన విద్య అని, అనుభవాగ్నులైన అధ్యాపకులు ఉన్నారని ప్రతి విద్యార్థి కూడా ఏకాగ్రతతో చదువుకోవాలని సూచించారు. చదువుతోపాటు కళాశాలలో విద్యార్థులు క్రీడా రంగాలలో రాణించాలని కోరారు. ప్రభుత్వం పేద విద్యార్థుల చదువు కోసం ఉచితంగానే పాఠ్యపుస్తకాలు ప్రభుత్వం అందిస్తుందని తెలిపారు. కళా శాలలో 100కు 100 శాతం ఉత్తీర్ణత సాధించాలని తెలిపారు. ఇంటర్మీడియట్‌లో మంచి మార్కులు సాధించి తల్లిదండ్రులు, కళాశాల, మండలానికి పేరు తీసుకురావాలని సూచించారు. అనంతరం వార్షికోత్సవ సందర్భంగా ఏర్పాటు చేసిన క్రీడా పో టీల్లో గెలుపొందిన విద్యార్థినీ, విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. అనంతరం విద్యార్థులు నృత్యాలు చేశారు. ఈ కార్యక్రమంలో జేపీఎంసీ ప్రిన్సిపాల్ సంజీవ్ కుమార్, ప్రిన్సిపాల్ వెంకటయ్య ఎంపీటీసీ సమ్మయ్య మహమ్మద్ గౌస్, సర్పంచ్ రాధిక వెంకట్ రెడ్డి, అధ్యాపకుల బృందం విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల సమ్మె నోటీస్

నవతెలంగాణ-ఆత్మకూర్



ఫిబ్రవరి 16న జరుగు దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని అమరచింత మున్సిపల్ కమిషనర్‌కు సమ్మె నోటీస్ అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఆర్ఎస్.రమేష్, మున్సిపల్ యూనియన్ నాయకులు ఎం.ప్రభాకర్, ప్రేమ్‌కుమార్ మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలని ఏరియల్స్ ఇవ్వాలని పెండింగ్‌లో ఉన్న వేతనాలు చెల్లించాలని కనీస వేతనం రూ.26వేలు అమలు చేయాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. ఫిబ్రవరి 16న జరిగే దేశా వ్యాప్తంగా సమ్మెలో మున్సిపల్ కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ నాయకులు హరికృష్ణ, సునీల్, కాకి శ్రీను, రవీందర్, తిపన్న, చిన్న, అజెందర్, మహేందర్, ఖతల్, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

టీఎస్ యూటీఎఫ్ మండల నూతన కమిటీ ఎన్నిక

నవతెలంగాణ-వీపనగండ్ల



మండల కేంద్రంలో టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్షులు రవిప్రసాద్ సమక్షంలో మండల నూతన కమిటీని, వీపనగండ్ల కాంప్లెక్స్, తూముకుంట కాంప్లెక్స్ కమిటీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. టీఎస్ యూటీఎఫ్ మండల గౌరవ సలహాదారుడుగా కృష్ణ నాయక్, భానుచందర్, గౌరవాధ్యక్షులుగా శివుడు, మండల అధ్యక్షులుగా తిరుమలేశాచారి, ప్రధాన కార్యదర్శిగా బాలీశ్వర్, కోశాధికారిగా కృష్ణ, ఉపాధ్యక్షులుగా సలేహ, కృష్ణయ్య, రాధా, కార్యదర్శులుగా స్వామి, గోవర్ధన్, కృష్ణ, క్రాంతి కుమార్, శరత్ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అదేవిధంగా టీఎస్ యూటీఎఫ్ వీపనగండ్ల కాంప్లెక్స్ కమిటీ అధ్యక్షులుగా స్వామి, ప్రధాన కార్యదర్శిగా కృష్ణయ్య ఉపాధ్యక్షులుగా వెంకటేష్, కమలమ్మ, కోశాధికారిగా శరత్, తూముకుంట కాంప్లెక్స్ అధ్యక్షులుగా గోవర్ధన్, ప్రధాన కార్యదర్శిగా కృష్ణయ్య, ఉపాధ్యక్షులుగా చిన్న వెంకటయ్య కోశాధికారిగా చెన్న రాముడులను ఎన్నుకున్నారు.



ప్రజా యుద్ధనౌక గద్దర్ జయంతి

నవతెలంగాణ- పెబ్బేరు

ప్రజా యుద్ధనౌక, విప్లవ గీతా రచయిత గద్దర్ జయంతి వేడుకలను పెబ్బేరు మున్సిపాలిటీలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. జిల్లా బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు అక్కి శ్రీనివాస్ గౌడ్, కారుపాకుల వేంకటరాములు ఆధ్వర్యంలో సుభాష్ చౌరస్తాలో గద్దర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం ఆయన కృషిని కొనియాడారు. పాటతో ప్రజానీకాన్ని ఉర్రూతలూగించారని, తద్వారా రాష్ట్ర ఏర్పాటుకు దోహదం చేశారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు విజయవర్ధన్ రెడ్డి, వెంకటేశ్ సాగర్, సురేందర్ గౌడ్, గంధం రాజు, రంజిత్ కుమార్ దయాకర్ రెడ్డి, గంధం సునీల్, గంధం వినయ్, సత్యనారాయణరెడ్డి, రాములు, సత్యనారాయణ, జ్యంగిర్, పెబ్బేరు యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు సాయితేజ గౌడ్, యువ నాయకులు హేమంత్, గంధం అంజి, మండల ఎన్ఎస్‌యూఐ ప్రెసిడెంట్ అనిల్, శివ, గణేష్ మహేష్, అశోక్ పాల్గొన్నారు.

సర్పంచ్‌లకు ఘన సన్మానం



నవతెలంగాణ - వీపనగండ్ల

మండల పరిధిలోని సంగినేనిపల్లి గ్రామంలో సర్పంచుల పదవీకాలం ముగుస్తుండడంతో సంగినేనిపల్లి గ్రామాల్లోని గ్రామపంచాయతీ కార్యాలయం దగ్గర గ్రామ సర్పంచు ఆర్.మౌలాలి, ఉప సర్పంచ్ లక్ష్మయ్య, వార్డు నెంబర్లను, అంగన్వాడి కార్యకర్తలు రాధా, లక్ష్మీదేవమ్మ పూలమాల శాలువాతో ఘనంగా సన్మానం చేశారు. ఎంపీటీసీల ఫోరం సంఘం జిల్లా అధ్యక్షులు డాక్టర్ ఇంద్రకంటి వెంకటేష్, గ్రామ సర్పంచ్ మౌలాలి, జడ్పీహెచ్ఎస్ ఉన్నత పాఠశాల హెచ్ఎం, ప్రాథమిక పాఠశాల హెచ్ఎం బాలేశ్వర్ అంగన్వాడి కార్యకర్తలకు, ఆశా కార్యకర్తలకు, గ్రామపంచాయతీ కార్మికులను ఘనంగా పూలమాల శాలువాలతో సన్మానం చేశారు. అదేవిధంగా వీపనగండ్ల బొల్లారం గ్రామంలో ఘనంగా సన్మాన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పద్మ ఎంపీటీసీ కవిత, మాజీ సర్పంచ్‌లు గంగిరెడ్డి, విజయ భాస్కర్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు, నరేష్, శ్యాంసుందర్, ఉప సర్పంచ్లు పెద్ద రాముడు, లక్ష్మయ్య, వార్డ్ నెంబర్లు ఆశన్న, బాలపీర్, మాధవి, గ్రామస్తులు రామచంద్రయ్య గౌడ్, జగదీష్, రాజు, సుదర్శన్ రెడ్డి, శివుడు, పాపయ్య, కృష్ణయ్య నక్కవిష్ణు, గోపి, కావాలి మహేష్ పాల్గొన్నారు.

అందరి సహకారంతో గ్రామ అభివృద్ధి జరిగింది

- సర్పంచుల మండల అధ్యక్షులు కురుమూర్తి



నవతెలంగాణ - మదనాపురం

అందరి సహకారంతో గ్రామ అభివృద్ధి జరిగిందని సర్పంచుల సంఘం మండల అధ్యక్షులు కురుమూర్తి అన్నారు. మదనాపురం మండలంలోని రామన్‌పాడ్ గ్రామ పంచాయితీ కార్యాలయంలో బుధవారం పంచాయితీ కార్యదర్శి, వార్డ్ సభ్యులను ఘనంగా సత్కరించారు. దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి చొరవతో గ్రామానికి ప్రత్యేక నిధులను మంజూరు చేయించి గ్రామానికి కొత్త కళను తీసుకురావడం జరిగిందన్నారు. ఎప్పటిలాగే ప్రజల మధ్య ఉంటూ గ్రామ సంక్షేమం కోసం అధికారులకు సహకరిద్దమని సూచించారు. పదవులు ఎప్పటికీ శాశ్వతం కాదని, ఒడిదుడుకులు ఏవైనా ఉన్నా సర్దుకుపోదామని గ్రామ పంచాయితీ వార్డ్ సభ్యులకు వివరించారు. కార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శి శిరీష, ఉప సర్పంచ్ బుజ్జమ్మ రవినాయక్, వార్డ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన మహిళా పాలిటెక్నిక్ కళాశాల బృందం



పెబ్బేరు : ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాల పెబ్బేరు ప్రిన్సిపాల్ ఏ.కె.శ్రీకాంత్, అధ్యాపక బృందం గంధం రంగస్వామి, కేతావత్ దశరత్ నాయక్ ఆధ్వర్యం లో వనపర్తి నియోజకవర్గ నూతన ఎమ్మెల్యే తూడి మేఘా రెడ్డిని కలిసి వారికి శుభాకాంక్షలు తెలిపినట్లు కళాశాల బృందం తెలిపారు. కళాశాలలోని నూత నంగా ప్రారంభించబోయే హాస్టల్ భవనానికి సంబంధించిన అన్ని సమస్యల ను తీరుస్తామని హామీ ఇచ్చారు. కళాశాల అభివృద్ధి కొరకు పూర్తి ప్రతిపాదన లను ఎమ్మెల్యేకి వినతిపత్రం రూపంలో సమర్పించడమైనది, ఇట్టి విషయంలో ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి వీలైనంత తొందర్లోనే అన్ని వసతులను సమకూరుస్తామని హామీ ఇచ్చారు.

పాదయాత్రకు బయలుదేరిన కాంగ్రెస్ నాయకులు

నవతెలంగాణ-ఆత్మకూరు

నారాయణపేట జిల్లా మక్తల్ నియోజకవర్గంలో వంశీ చందర్ రెడ్డి ప్రారంభించనున్న పాలమూరు పాదయాత్రకు సంఘీభావం తెలుపటానికి ఆత్మకూరు నుండి కాంగ్రెస్ నాయకులు బయలుదేరారు. ఇట్టి కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షులు పట్టణ అధ్యక్షులు పరమేష్, నల్లగొండ శ్రీనివాసులు, శ్రీనివాస్ రెడ్డి, ఈర్లదిన్నె శ్రీనివాసులు, హమాలీ అంజి, రవికుమార్, భాస్కర్, నరేష్ , సలీం, టాకీ ఆంజనేయులు ఉన్నారు.

మోడీని గద్దె దించడమే లక్ష్యం

- మతోన్మాద బిజెపిని ఓడించాలి
- రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జాన్‌వెస్లీ

నవ తెలంగాణ - వనపర్తి

మతోన్మాద బీజేపీనీ ఓడించి మోడీని గద్దించడమే తమ లక్ష్యమని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జాన్‌వెస్లీ అన్నారు. బుధవారం వనపర్తి జిల్లా కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ దేశ ప్రజల జీవితాలను సంక్షోభంలోకి నెట్టి, ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్న కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు సీపీఐ(ఎం) శాయశక్తులా పోరాడుతుందని పేర్కొన్నారు. బీజేపీలో ఇప్పటివరకు మోడీ ఒక్కరే స్టార్ క్యాంపెనర్‌గా ఉండేవారని ఇప్పుడు ఆయనతో పాటు రాముడు కూడా స్టార్ క్యాంపెనర్‌గా 2024 లోక్‌సభ ఎన్నికల్లో ఉండబోతున్నారన్నారు. 2024 లోక్‌సభ ఎన్నికలకు సన్నద్ధతపై సీపీఐ(ఎం) కేంద్రకమిటీ చర్చించిందన్నారు. అయోధ్యలో రామమందిర ప్రారంభోత్సవ తీరు రాజ్యాంగాన్ని ఉల్లంఘించేందుకు బీజేపీ ప్రభుత్వం స్పష్టమైన ప్రణాళికతో ఉందనే విషయాన్ని వెల్లడించిందన్నారు. బీజేపీని గద్దె దించేందుకు రాష్ట్రాల వారీగా సమాయత్తమవుతున్నట్లు తెలిపారు. ఒక్కో రాష్ట్రంలో ఒక్కో పరిస్థితి ఉంది. కేరళలో ఎల్‌డీఎఫ్, కాంగ్రెస్ మధ్య ప్రత్యక్ష పోరు ఉందని, ఇక్కడ బీజేపీకి సీట్లు రావని, అదే తమిళనాడులో డీఎంకే నేతృత్వంలోని సెక్యులర్ ఫ్రంట్, బీహార్‌లో నితీష్‌కుమార్ పార్టీ మినహా మహాకూటమి



ఉందని, 'ఇండియా' వేదికకు చాలా రాష్ట్రాల్లో ఉమ్మడి అభ్యర్థులు ఉన్నారని తెలిపారు. బీహార్‌లో ప్రస్తుత పరిణామాలకు నితీష్ కుమారే కారణమన్నారు. ఈడీ, సీబీఐని బీజేపీ కేంద్ర ప్రభుత్వం రాజకీయ సాధనంగా వాడుకుంటున్నాయని మండిపడ్డారు. ఈడీ కేసు పెట్టిన వారు బీజేపీలో చేరితే కేసు క్లోజ్ అయ్యే పరిస్థితి ఉందని, 2019 తరువాత ఈడీ 5,500 కంటే ఎక్కువ కేసులను నమోదు చేసిందని, 23శాతం కేసులు మాత్రమే కోర్టుకు చేరాయని, ప్రత్యర్థులను భయపెట్టడానికి, వేధించడానికి ఈడీ పనిచేస్తుందని మండిపడ్డారు. ఈ సమావేశంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి ఎండి.జబ్బార్, కార్యదర్శివర్గ సభ్యులు పుట్ట ఆంజనేయులు, మేకల ఆంజనేయులు, బాల్‌రెడ్డి, గోపి, నాయకులు ఎం.రాజు, ఎస్.రాజు, బి.వెంకటేష్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంను కలవనున్న కొత్త స్టాఫ్ నర్సులు





నవతెలంగాణ - వనపర్తి

జిల్లా నుంచి కొత్తగా స్టాఫ్ నర్సులుగా ఎంపికైన అభ్యర్థులు నేడు సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా నియామక పత్రాలు అందుకోనున్నారు. ఇందుకోసం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రెండు ప్రత్యేక బస్సుల్లో వారు బయలు దేరారు. పాలిటెక్నిక్ కళాశాల ప్రాంగణం నుండి ఈ బస్సులకు ఎమ్మెల్యే తూడి మేఘా రెడ్డి జెండా ఊపి సాగనంపారు. జిల్లా నుంచి మొత్తం 99 మంది పరీక్షల్లో ఎంపిక కాగా, అందులో 67 మంది బస్సుల్లో బయలు దేరినట్లు వైద్య శాఖ అధికారులు తెలిపారు. మిగిలిన వారు స్వతహగా వస్తున్నట్లు తెలిపారు. వీరంతా నేడు హైదరాబాద్ లోని ఎల్ బీ స్టేడియంలో సీఎం రేవంత్ చేతుల మీదుగా నియామక పత్రాలు అందుకోనున్నట్లు తెలిపారు. కార్యక్రమం లో ఎంపీపీ కిచ్చా రెడ్డి, మాజీ జడ్పీటీసీ వెంకటయ్య, డీఎంహెచ్వో జయచంద్ర మోహన్, డిప్యూటీ డీఎంహెచ్వో శ్రీనివాసులు, శ్రీనివాసులు, ఏట డాక్టర్ సాయినాథ్ రెడ్డి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు పాల్గొన్నారు.

మున్సిపాలిటి పరిధిలో పెండింగ్ ట్యాక్సులను వేగంగా సేకరించాలి

నవ తెలంగాణ - వనపర్తి

మున్సిపాలిటీ పరిధిలో పెండింగ్‌లో ఉన్న అన్ని ట్యాక్సుల బకాయిలను (ప్రాపర్టీ ట్యాక్స్, ఇతర ట్యాక్సులన్నీ) వందశాతం వెంటనే సేకరించాలని అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) సంచిత్ గంగ్వార్ ఆదేశించారు. బుధవారం అడిషనల్ కలెక్టర్ మీటింగ్ హాల్లో మున్సిపాలిటీ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. మున్సిపాలిటీ పరిధిలో పెండింగ్‌లో ఉన్న అన్ని ట్యాక్సులను వేగంగా వంద శాతం సేకరించాలని ఆదేశించారు. పట్టణంలో నీటి సరఫరా నిత్యం జరగాలని, అందుకోసం ఏవైనా సమస్యలు ఉంటే పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ప్రజలకు నీటి సరఫరా విషయంలో ఎలాంటి సమస్యలు రాకుండా చూడాలని చెప్పారు. పట్టణంలోని పాలిటెక్నిక్ కళాశాల ముందు ఉన్న హోర్డింగ్‌లను తొలగించాలని ఆదేశించారు. అదేవిధంగా వనపర్తిలో జంతు సంరక్షణ కేంద్రాన్ని వినియోగంలోకి తెచ్చేలా ఏర్పాట్లు చేయాలని చెప్పారు. మున్సిపాలిటీ పరిధిలో అక్రమలే అవుట్లకు సంబంధించి అన్ని రకాల దస్త్రాలను సమర్పించాలని



ఆదేశించారు. అదేవిధంగా, మున్సిపాలిటీ కోసం కొనుగోలు చేసిన స్వీపింగ్ మెషీన్ వివరాలు, దాని కొనుగోలు, రిపేరుకు సంబంధించిన అన్ని వివరాలు వెంటనే సమర్పించాలని ఆదేశించారు. అంతేకాకుండా, చౌరస్తాలలో ట్యాక్సీ స్టాండ్ ఏర్పాటు చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశంలో మునిసిపల్ కమీషనర్ విక్రమ సింహారెడ్డి, డీఈలు, ఏఈలు, ఇతర మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

క్రీడలు స్నేహపూర్వకంగా జరగాలి

- క్రీడల్లో గెలుపోటములు సహజ
- పెబ్బేరులో పిపిఎల్ 14 ఎడిషన్ క్రికెట్ పోటీల్లో ఎమ్మెల్యే తుడా మెగా రెడ్డి



నవతెలంగాణ - పెబ్బేరు

క్రీడలు స్నేహపూర్వకంగా జరగాలని క్రీడల్లో గెలుపోటములు సహజమని వనపర్తి ఎమ్మెల్యే తుడి మెగా రెడ్డి అన్నారు. బుధవారం పెబ్బేరులో శ్రీ చౌడేశ్వరి దేవి జాతర ఉత్సవాల సందర్భంగా ఆజాద్, హనుమాన్ యూత్ ఆధ్వర్యంలో పెబ్బేరు మినీ స్టేడియంలో జరుగుతున్న పీపీఎల్ 14 ఎడిషన్ క్రికెట్ పోటీలలో ఎమ్మెల్యే పాల్గొని క్రీడాకారులను ఉత్తేజపరిచారు. కేడీఆర్ గ్రూప్స్ రిసీ రైడర్స్ జట్ల మధ్య జరుగుతున్న క్రికెట్ పోటీలకు టాస్ వేసి క్రీడలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ క్రీడలతో యువత మానసిక ఉల్లాసం పొందుతారని ఆరోగ్యంగా దృఢంగా ఉండేందుకు క్రీడలు దోహదపడతాయన్నారు. క్రీడల్లో గెలుపోటములు సహజమే అయినప్పటికీ గెలిచినవారు. సంతోషంతో ఓడిన వారు మళ్లీ ఎలాగైనా గెలవాలని ఉత్సాహంతో ఉండాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం క్రీడలను ప్రోత్సహిస్తుందన్నారు. మెగారెడ్డి క్రికెట్ ఆడి క్రీడ అభిమానులను ఉత్తేజపరిచారు. ఉదయం క్రికెట్ పోటీలను మున్సిపల్ చైర్ పర్సన్ ఎద్దుల కరుణ, శ్రీసాయి, పాలకవర్గం, క్రికెట్ నిర్వాహకులు జట్ల నిర్వాహకులు క్రీడాకారులు పాల్గొని క్రికెట్ పోటీలను ప్రారంభించారు. మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి పీజేపీ క్యాంపు కాలనీలో 10ఎకరాల స్థలాన్ని క్రీడా ప్రాంగణానికి కేటాయించగా, ప్రస్తుత ఎమ్మెల్యే తుడిమేగారెడ్డి క్రికెట్ నిర్వాహకుల సూచన మేరకు నిధులు రెండు లక్షలతో క్రీడా ప్రాంగణాన్ని సుందరంగా తీర్చిదిద్దేందుకు కృషి చేశారు. తొమ్మిది రోజులపాటు జరిగే క్రికెట్ పోటీలలో ఏడుగురు ప్రంచేజెర్స్‌గా టీమ్లు పోటీ పడనున్నాయి. క్రికెట్ పోటీలు ఉత్సాహభరితంగా సాగాయి. బుధవారం జరిగిన రెండో మ్యాచ్లో ఎస్వీఎస్ ట్రిక్స్, జెకె వారియర్స్ మధ్య జరిగిన హోరాహోరీ పోరులో మూడు పరుల తేడాతో జెకె వారియర్స్ గెలుపొందింది. కార్యక్రమంలో ఎమ్మెల్యే తుడిమేగా రెడ్డి తో పాటు మున్సిపల్ పాలకవర్గం జిల్లా బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు అక్కి శ్రీనివాస్ గౌడ్, నాయకులు వెంకటేష్ సాగర్, రంజిత్ కుమార్, సురేందర్ గౌడ్, భాను ప్రకాష్ రెడ్డి, వెంకట్ రాములు, దయాకర్ రెడ్డి, సత్యం, సత్యనారాయణ రెడ్డి, ఆర్గనైజర్స్ రాము కామెంటరీ ప్రవీణ్ కుమార్ గౌడ్ క్రికెట్ జట్ల నిర్వాహకులు, వివిధ పార్టీల నాయకులు క్రీడాభిమానులు తదితరులు పాల్గొన్నారు.

రోగులకు అండగా జనరిక్ మందులు

- జనం వద్దకు జనరిక్ మందులు
- ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా వైస్ చైర్మన్ సయ్యద్ కలాం షాషా

నవ తెలంగాణ - వనపర్తి

రోగులకు అండగా జనరిక్ మందులు ఉన్నాయని, ఇకపై జనం వద్దకు జనరిక్ మందులు వస్తాయని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ వనపర్తి జిల్లా వైస్ చైర్మన్ కలాం పాషా అన్నారు. వనపర్తి పట్టణంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ వనపర్తి జిల్లా ఆధ్వర్యంలో జనరిక్ మందుల పై అవగాహన కార్యక్రమంలో భాగంగా బుధవారం కరపత్రాల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ వనపర్తి జిల్లా వైస్ చైర్మన్ సయ్యద్ కలాం పాషా మాట్లాడుతూ మన జీవనశైలి, మన ఆహారపు అలవాట్లు మార్పుల వల్ల జంక్ ఫుడ్ మైదాపిండితో తయారైన ఆహారపు పదార్థాలు ఎక్కువగా తీసుకోవడం వలన బయటి తిను బండారులకు ఎక్కువగా తినడం వలన బయట తీసుకునే కల్తీ ఆహారపు పదార్థాలు గుర్తించకపోవడం వలన మత్తు పదార్థాలకు బానిసలై అనారోగ్యానికి గురవుతున్నారు ఇలాంటి విషపూరిత ఆహారపు అలవాట్లు వల్ల మధుమేహం అధిక రక్తపోటు థైరాయిడ్ క్యాన్సర్ అజీర్తి లాంటి ఎన్నో వ్యాధులకు గురవుతున్నారు వైద్యం కొరకు ఆసుపత్రుల చుట్టూ క్యు కడుతున్నారు మంచి ఆహారపు అలవాట్లు వల్లే ఆరోగ్యంగా ఉంటామని ఇప్పటికైనా మన జీవన శైలి మార్చుకోవాలని ప్రతిరోజు యోగ వ్యాయాయం ప్రాణాయం ఏకాగ్రత అరగంట పాటు వాకింగ్ చేయాలని మన ఆరోగ్యం మనమే కాపాడుకోవాలని అన్నారు దీర్ఘకాలికంగా బాధపడుతున్న వ్యాధిగ్రస్తులకు ఇతర అనారోగ్యాలకు బారినపడి మందులు కొనలేక డబ్బులు లేక ఇబ్బందులకు గురవుతున్న రోగులకు నాణ్యమైన మందులు అది తక్కువ ధరకే అందించాలన్న కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త



సూచన మేరకు ప్రతి ఒక్కరి ఆరోగ్య పరిరక్షణకై ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జనరిక్ మెడికల్ స్టోర్ ద్వారా అన్ని రకాల నాణ్యమైన మందులు చౌక ధరలకే అందించాలని వనపర్తి జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి నందు ఎం సి హెచ్ ఆసుపత్రి నందు జనరిక్ మెడికల్ స్టోర్ ద్వారా తక్కువ ధరలకే రోగులకు నాణ్యమైన మందులు అందిస్తున్నాము జనరిక్ మందుల పై అవగాహన కార్యక్రమంలో భాగంగా ప్రజలకు అవగాహన పరచాలని జనరిక్ మందులు వాడాలని వాటిపై ఉన్న అపోహలను తొలగిస్తూ చైతన్య పరచడం జరిగింది ఈ కార్యక్రమంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ వనపర్తి జిల్లా కోఆర్డినేటర్ ఆర్ రాజేందర్ కుమార్ ఎండి పాషా తదితరులు పాల్గొన్నారు.



ప్రభుత్వ పాఠశాలను బలోపేతం చేయాలి

- టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్షులు రవి ప్రసాద్ గౌడ్

నవతెలంగాణ- వీపనగండ్ల

ప్రభుత్వ పాఠశాలలో నెలకొన్న సమస్యలు పరిష్కరించి పాఠశాలలను ప్రభుత్వం బలోపేతం చేయాలని టీఎస్ యూటీఎఫ్ అధ్యక్షులు రవి ప్రసాద్ గౌడ్ డిమాండ్ చేశారు. వీపనగండ్లలో మండల టీఎస్ యూటీఎఫ్ మండల సమావేశాన్ని నిర్వహించారు. సమావేశానికి ఆయన హాజరై మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల బలోపేతంతోపాటు ఉపాధ్యాయ సమస్యలైన పాత పెన్షన్ విధానం పునరుద్ధరణ, ప్రమోషన్లు, బదిలీలు, 317జీవో ప్రభావిత ఉపాధ్యాయ సమస్యలు, ఇప్పటివరకు పెండింగ్ బిల్లులు, డీఏలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయ రంగ సమస్యల పరిష్కారం కోసం సంఘం రాజీలేని పోరాటాలు నిర్వహిస్తుందన్నారు. సంఘం బలోపేతం కోసం కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టీఎస్ యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలి



నవతెలంగాణ-మదనాపురం

కొత్తకోట కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ పద్ధతిలో పనిచేస్తున్న మున్సిపల్ సిబ్బందిని పర్మనెంట్ చేసి, కనీస వేతనం రూ.26వేలు అమలు చేయాలని సీఐటీయూ వనపర్తి జిల్లా ఉపాధ్యక్షులు బొబ్బిలి నిక్సన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం సీఐటీయూ ఆధ్వర్యంలో కమిషనర్‌కి వినతిపత్రం ఇచ్చి మాట్లాడారు. ఫిబ్రవరి 16న కార్మికుల సమస్యల పరిష్కారం కోసం సమ్మె నిర్వహిస్తామని సమ్మెలో కార్మికులందరూ పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు. ప్రస్తుతం పని చేస్తున్న కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్, ఎన్ఎంఆర్, ఫిక్స్ పే కార్మికులను సైతం పర్మనెంట్ చేయాలని, రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే నిధులనుండే ప్రతినెల వేతనాలు చెల్లించాలని కోరారు. ఆంధ్రప్రదేశ్‌లో మున్సిపల్ కార్మికులకు చెల్లిస్తున్నట్లుగానే తెలంగాణలో కూడా నెలకు రూ.24వేలు వేతనం చెల్లించాలని వెల్లడించారు. కొత్తగా నియమించుకున్న కార్మికులను పాత కార్మికులతో సమానంగా వేతనాలను ఇవ్వాలన్నారు. ప్రమాదంలో మరణిస్తున్న కార్మికులకు రూ.25లక్షలు ఇన్సూరెన్స్ పథకాన్ని ప్రవేశపెట్టి, దహన సంస్కారాలకు రూ.30వేలు ఇవ్వాలని సూచించారు. మున్సిపల్ కార్మికుల పిల్లలకు ప్రత్యేక స్కాలర్‌షిప్ ఇచ్చి ఉన్నత చదువులకు ప్రోత్సాహం కల్పించాలన్నారు. కార్యక్రమంలో అధ్యక్షులు ఆనంద్ రాజు, కార్యదర్శి రమేష్, కొండన్న, కురుమన్న, బాలస్వామి, నోవేలు, కొండన్న, పెద్దరాజు, ప్రసాద్, మద్దిలేటి, శేఖర్, లక్ష్మి, సుశీల, సరళ, సుగుణమ్మ, దివ్య, పద్మ తదితరులు పాల్గొన్నారు.

12 మంది వెట్టిచాకిరి కూలీలకు విముక్తి

నవతెలంగాణ-వనపర్తి

పట్టణ శివారు మెట్టుపల్లిలోని ఓ ఇటుక బట్టి కేంద్రంలో ఇబ్బంది కర పరిస్థితుల్లో వెట్టిచాకిరి కూలీలుగా పని చేస్తున్న 12మందికి కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ ఆదేశాలతో కార్మిక శాఖ అధికారి చొరవ తీసుకుని విముక్తి కల్పించారు. వివరాల్లోకి వెళ్తే.. ఒరిస్సాకు చెందిన 12మంది కూలీలు మెట్టుపల్లిలో ఆర్‌జీవీ ఇటుక బట్టి కేంద్రంలో ఇబ్బందికర పరిస్థితుల్లో పని చేస్తున్నారని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ దృష్టికి వచ్చింది. దీంతో రెస్క్యూ చేసి వారికి విముక్తి కల్పించాలని కార్మిక శాఖ అధికారికి కలెక్టర్ ఆదేశించారు. వెంటనే రంగంలోకి దిగిన రెస్క్యూ ఆపరేషన్ అధికారులు 12 మంది కూలీలను, వారు చెప్పిన వివరాల ప్రకారం వెట్టిచాకిరి (బాండెడ్ లేబర్)గా గుర్తించి విముక్తి కల్పించారు. ఇటుక బట్టి యజమాని సురేష్ వారిని తక్కువ జీతానికి ఎక్కువ పని చేయిస్తూ వేదిస్తున్నట్లు కూలీలు పేర్కొన్నట్లు లేబర్ ఆఫీసర్ వేణుగోపాల్ తెలిపారు. యజమాని పై బాండెడ్ లేబర్ చట్టం కేసులు నమోదు చేసినట్టు తెలిపారు. ఈ సందర్భంగా వేణుగోపాల్ మాట్లాడుతూ పట్టణంలో ఇంకా ఎవరైనా ఇటువంటి పనులకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లా కలెక్టర్ అనుమతి తో 12 మంది కూలీలకు కేంద్ర ప్రభుత్వం నుంచి ఆర్థిక సహాయం ఇప్పించే కృ షి చేస్తామని చెప్పారు. రెస్క్యూ బృందంలో తహసీల్దార్ యాదగిరి, ఎస్సై అంజాద్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

పేద విద్యార్థులు సైతం ఉన్నత ఉద్యోగాలు సాధించవచ్చు..

- జిల్లా బీసీ అభివృద్ధి అధికారి బీరం సుబ్బారెడ్డి

నవతెలంగాణ- వనపర్తి

ప్రోత్సాహం ఉంటే పేద విద్యార్థులు సైతం ఉన్నత ఉద్యోగాలు సాధించవచ్చని జిల్లా బీసీ అభివృద్ధి అధికారి బీరం సుబ్బారెడ్డి అన్నారు. బుధవారం వనపర్తి జిల్లా కలెక్టర్ కార్యాలయ సముదాయంలోని జిల్లా బీసీ అభివృద్ధి అధికారి కార్యాలయంలో గ్రూప్-1 ప్రిలిమ్స్ 2022, స్టెనోగ్రాఫర్ గ్రేడ్-3 ఉద్యోగం పొందిన ఎం.స్ఫూర్తిని సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత సంవత్సరం బీసీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో జోగులాంబ గద్వాల జిల్లాలో నిర్వహించిన కోచింగ్‌కు మన జిల్లా నుండి కూడా విద్యార్థులను పంపించడం జరిగిందని అందులో వనపర్తి జిల్లా కేంద్రానికి చెందిన ఎం స్ఫూర్తి వనపర్తి జిల్లా కోర్టులో స్టెనోగ్రాఫర్ గ్రేడ్-3 ఉద్యోగం సాధించడం అభినందనీయమన్నారు. పేద విద్యార్థుల అభ్యున్నతి కోసం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వనపర్తి, జోగులాంబ గద్వాల జిల్లాలోని బీసీ విద్యార్థులకు బీసీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో ఉన్నత ఉద్యోగల కోసం యూపీఎస్, సివిల్స్, లాంగ్ టర్మ్ కోచింగ్ ఇవ్వడం జరుగుతుందని విద్యార్థులు ఇలాంటి అవకాశాలను సద్వినియోగం చేసుకొని జీవితంలో ఉన్నత ఉద్యోగాల్లో స్థిరపడాలని ఆయన ఆకాక్షించారు. ఈ కార్యక్రమంలో జోగులాంబ గద్వాల జిల్లా బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ టీ. ప్రవీణ్, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ పదవిపై వివాదం సరికాదు

- తెలంగాణ మలిదశ ఉద్యమకారుడు, కాంగ్రెస్ నాయకులు మండ్ల దేవన్న నాయుడు

నవతెలంగాణ-వనపర్తి

తెలంగాణ రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం చచ్చిపోయిందని, ఎమ్మెల్సీ పదవిపై వివాదం సరికాదని తెలంగాణ మలిదశ ఉద్యమకారుడు మండ్ల దేవన్న నాయుడు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గవర్నర్ కోటా కింద కోదండ రాంను ఎమ్మెల్సీగా రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రతిపాదించిందన్నారు. ఇందుకు గవర్నర్ తమిళిసై ఆమోదం తెలిపారని గుర్తు చేశారు. అయితే గత ప్రభుత్వం ఉద్యమకారులను కరేపాకుల వాడుకొని వదిలేశారని, వారి కుటుంబాలు రోడ్డు పోలీస్ కేసులు పాలయ్యాయన్నారు. రోడ్లపై ఉంటవార్పు ధర్నా రాస్తారోకాలు అంటూ పనులు వదిలి పెట్టుకొని కుటుంబాలను వదిలి పెట్టుకొని తెలంగాణకు పోరాడారు కానీ తెలంగాణ వచ్చిన తర్వాత తెలంగాణ జెండా పట్టనోడు కి ఉద్యమ ద్రోహులకు ఉద్యమ ద్రోహులకు పదవులు ఇచ్చారు. అందుకు ఇది నిదర్శనం అని రాజకీయ కుట్రతో కేసీఆర్ వాయిదా వేస్తున్నారు. కోదండరాం గొప్పతనాన్ని ఒకరు చెప్పాలా తెలంగాణ ఉద్యమంలో ఆయన పాత్ర చాలా గొప్పది బీఆర్ఎస్ నేతలు ప్రశ్నించడం దారుణం. ఇవన్నీ తెలంగాణ ఉద్యమకారులను మోసం చేసిన కెసిఆర్ వచ్చే పార్లమెంట్ తెలంగాణ ఉద్యమకారులు మళ్లీ బుద్ధి చెప్తారని అన్నారు.

నరేందర్ రెడ్డికి సన్మానం

నవతెలంగాణ-కొల్లాపూర్ రూరల్

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య సలహాదారుడిగా నియమితులైన నరేందర్ రెడ్డిని కొల్లాపూర్ నియోజక వర్గ కాంగ్రెస్ సీనియర్ నాయకులు, టీపీసీసీ సభ్యులు చింతలపల్లి జగదీశ్వర్ రావు బుధవారం హైదరాబాద్‌లోని వారి నివాసంలో కలిసి ఆయనను శాలువతో సన్మానించి ప్రత్యేక శుభాకాం క్షలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎస్సీ కమ్యూనిటీహాల్, రైతు వేదిక ప్రారంభం

కొల్లాపూర్ రూరల్ : మండల పరిధిలోని కుడికిళ్ళ గ్రామంలో నూతనంగా నిర్మించిన ఎస్సీ కమ్యూనిటీ హాల్, రైతు వేదిక భవనాలు గ్రామంలో పలు అభివృద్ధి పనులను బుధవారం రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక పురావస్తు శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రారంభించారు. అనంతరం మంత్రి జూపల్లి మాట్లాడుతూ గ్రామంలో నిర్మించిన ఎస్సీ కమిటీ హాల్, అలాగే రైతు వేదికలను, గ్రామ అభివృద్ధికై వాడుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, గ్రామ ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వీడ్కోలు, స్వయం పరిపాలన దినోత్సవం

బల్మూరు : మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల ఉన్నత పాఠశాల, జూనియర్ కళాశాల విద్యార్థులకు స్వయం పరిపాలన దినోత్సవం, ఇంటర్ విద్యార్థులకు వీడ్కోలు సమావేశం బుధవారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థినీలు సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. ఈ సందర్భంగా ఎస్ఓ లలిత మాట్లాడుతూ ఇంటర్ చదివి త్వరలో జరిగే పరీక్షలలో మంచి మార్కులతో పాసై ఉన్నత చదువులు చదవాలని, పదో తరగతి చదువుతున్న విద్యార్థులు రానున్న పదో తరగతి పరీక్షల్లో మంచి మార్కులతో రాణించాలని కోరారు. భవిష్యత్తులో మంచి చదువులు చదువుతా మని ప్రతిజ్ఞ చేశారు. స్వయం పరిపాలన దినోత్సవం జరుపుకున్న విద్యార్థినిలు ఒకరోజు చాత్రోపాధ్యాయులుగా వ్యవహరించి ఉపాధ్యాయ వృత్తి పట్ల అనుభ వాలను వివరించారు. కార్యక్రమంలో కళాశాల, పాఠశాలకు విద్యార్థినిలతో పాటు, కేజీబీవీ ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థినిల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నేడు సర్పంచ్‌లకు వీడ్కోలు సమావేశం

తాడూర్ : మండల పరిధిలోని గ్రామపంచాయతీల సర్పంచ్‌లకు గురువారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో నూతన సమావేశ మందిరంలో ఎన్నికైన నాటి నుండి నేటి వరకు గ్రామపంచాయతీల అభివృద్ధి కొరకై అహర్నిశలు కృషి చేసి, గ్రామాలను ఉత్తమంగా తీర్చిదిద్దిన సర్పంచులు నేటితో అయిదు సంవ త్సరాల పదవీకాలం పూర్తి చేసుకున్న సందర్భంగా ఆత్మీయ వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు ఎంపీడీవో గంగమోహన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఎఫ్ఎల్ఎన్ ఉన్నతి లక్ష్యాలపై సమీక్ష

కోడేరు : ఎఫ్ఎల్ఎన్, ఉన్నతి కార్యక్రమాల అమలుపై కోడేరు ఎమ్మార్సీ కార్యాలయంలో మండల పరిధిలోని అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయుల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండల నోడల్ అధికారి నిర్మల అధ్యక్షత వహించి మాట్లాడారు. ప్రతి పాఠశాల నుంచి ఎఫ్ఎల్ఎన్, ఉన్నతి కార్యక్రమాలు అమలు కొరకు పాఠశాలలో చేపడుతున్న కార్యక్రమాలు, విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పాఠశాల వారీగా సమీక్ష నిర్వహించారు. విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో ఉపాధ్యాయులు బోధించాలని బోధనోపకరణాలను ఉపయోగించాలని, అదేవిధంగా రోజువారీగా విద్యార్థుల వర్క్ బుక్స్ పూర్తి అయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కోడేరు కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు కృష్ణయ్య, మండలంలోని వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, సీఆర్పీలు, ఎంఈఓ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఉచిత క్యాన్సర్ పరీక్ష వైద్య శిబిరం

బిజినేపల్లి : ఎన్ఆర్ఐ టి.రాంచంద్రారెడ్డి ఆర్థిక సాయంతో స్వస్థత క్యాన్సర్ కేర్ ఆస్పత్రి వైద్య బృదం ఆధ్వర్యంలో మండలంలోని నంది వడ్డెమాన్‌లో చేపట్టిన ఉచిత క్యాన్సర్ పరీక్ష వైద్య శిబిరం విజయవంతమైనట్లు నిర్వాహకులు తెలిపారు. బుధవారం గ్రామంలోని జడ్పీహెచ్ఎస్‌లో ఏర్పాటు చేసిన వైద్య శిబిరానికి 150మంది మహిళలు వచ్చి వైద్య పరీక్షలు చేయించుకున్నారు. వైద్య శిబిరం విజయవంతం కావడానికి గ్రామ సర్పంచ్ వంగ సుదర్శన్ గౌడ్, జగత్ చంద్రయ్య, యువకులకు సహకారం అందించారన్నారు.

స్టాఫ్ నర్స్ ఉద్యోగానికి ఎంపిక

వంగూరు : మండల పరిధిలోని సర్వారెడ్డి పల్లి తండా గ్రామపంచాయతీకి చెందిన కుబ్య నాయక్ కూతురు నేనావత్ మంజుల స్టాఫ్ నర్స్ ఉద్యోగానికి ఎంపికయ్యింది. చిన్నతనంలో తండ్రి చనిపోయి ఆర్థిక ఇబ్బందిలో ఉన్నా చదువుని ఆపకుండా పై చదువులు చదివి ప్రభుత్వ ఉద్యోగం సంపాదించింది. విద్యార్థిని, కుటుంబ సభ్యులు గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

242 మంది స్టాఫ్ నర్సులు ఎంపిక

కందనూలు : జిల్లా నుంచి కొత్తగా స్టాఫ్ నర్సులుగా ఎంపికైన అభ్యర్థులకు నేడు సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా నియామక పత్రాలు అందుకోనున్నారు. ఇందుకోసం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 5 ప్రత్యేక బస్సుల్లో వారు బయలుదేరారు. బుధవారం కలెక్టరేట్ ప్రాంగణం నుండి ఈ బస్సులను డీఎంహెచ్ఓ సుధాకర్ లాల్, ఆర్టీసీ ఆర్ఎంవో బాల సరస్వతిలు సాగనంపారు. జిల్లా నుంచి మొత్తం 242మంది పరీక్షల్లో ఎంపిక కాగా, అందులో 240మంది బస్సుల్లో బయలు దేరినట్లు వైద్య శాఖ అధికారి తెలిపారు. ఒకరు విదేశాల్లో ఇంకొకరు ఆరోగ్య కారణాలతో నేటి నియామక పత్రాల కార్యక్రమానికి ఇద్దరూ హాజరు కాలేకపోతున్నారని ఆయన తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఇమ్యూనియేషన్ అధికారి డాక్టర్ రవి నాయక్, రేణయ్య, ఆర్టీసీ సీఐ బాల్‌రెడ్డి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, ఆర్టీసీ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ఐఎన్టీయూసీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పర్వతాలు

బిజినేపల్లి : ఐఎన్టీయూసీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బిజినేపల్లి గ్రామానికి చెందిన బంగారి పర్వతాలును నియమిస్తూ జాతీయ ప్రధాన కార్యదర్శి హాసీలింద్ర ప్రసాద్, జాతీయ ఉపాధ్యక్షుడు ఏకే చౌదరి, రాష్ట్ర ఐఎన్టీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ బుద్దారం మురహరీలు బుధవారం ఆయనకు నియామక పత్రం అందజేసినట్లు తెలిపారు. ఎన్నికల ముందు ఐన్టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఉన్న బంగారి పర్వతాలు కాంగ్రెస్ గెలుపుకు పాటుపడ్డావని అభినందించారు. బంగారి పర్వతాలను వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఎంపిక కావడం పట్ల మండల కాంగ్రెస్ నాయకులు, ఐన్టీయూసీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఐస్టీయూసీ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు సాయిబాబా, మహిళా అధ్యక్షురాలు మన్నే శరణ్యరెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు బోరింగ్ శ్రీనివాసులు, శ్రీశైలం, మ్యాతరి సత్యం ఉన్నారు.

వెల్దండ ఎస్సైగా మోతాల రవి

వెల్దండ : నూతన ఎస్సైగా మోతల రవి నియామకమయ్యారు. వెల్దండలో ఎస్సైగా విధులు నిర్వహిస్తున్న శ్రీను బదిలీపై జోగులాంబ గద్వాల జిల్లాకు వెళ్లగా, వెల్దండ సర్కిల్ పరిధిలోని చారకొండ ఎస్సైగా బాధ్యతలు నిర్వహిస్తున్న మోతాల రవి వెల్దండ ఎస్సైగా బదిలీపై వచ్చారు. మోతల రవి బుధవారం ఎస్సైగా బాధ్యతలు చేపట్టారు.

ప్రొఫెసర్ జయశంకర్ ట్రస్ట్ పేరుపైన రిజిస్ట్రేషన్ కమిటీ ఎన్నిక...

కందనూలు : జిల్లా కేంద్రంలో బుధవారం రిజిస్ట్రేషన్ కార్యాలయంలో తెలంగాణ జాతిపిత ప్రొఫెసర్ జయశంకర్ ట్రస్టు పేరుపైన రిజిస్ట్రేషన్ చేశారు. దీనిలో భాగంగా ట్రస్ట్ కమిటీ ఎన్నుకున్నారు. ట్రస్ట్ చైర్మన్ వంగూరి జయశంకర్, వైస్ చైర్మన్ బీరగల సంతోష్, సెక్రెటరీ దన్నోజి అరవింద్‌చారి, కోశాధికారి కాకునూరు మహేష్, కరుణాకర్, మోహన్, మహేష్ సభ్యులుగా ఎన్నుకున్నారు.

'మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయాలి'

నవతెలంగాణ-కందనూలు

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయాలని జిల్లా నోడల్ అధికారి వెంకటరమణకి బీఎస్ఎఫ్ ఆధ్వర్యంలో బుధవారం వినతి పత్రం అందజేశారు. అనంతరం జిల్లా నోడల్ అధికారి వెంకటరమణ మాట్లాడుతూ తక్షణమే ఈ సమస్యపై అధికారులకు తెలియజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బహుజన విద్యార్థి సమైక్య జిల్లా అధ్యక్షుడు కే.రామకృష్ణ, బీఎస్ఎఫ్ నాయకులు చందు, బాలరాజ్, వెంకటేష్, రాజు, పుల్లేష్ పాల్గొన్నారు.

వాహనదారులకు అవగాహన : రవాణా శాఖ జిల్లా అధికారి ఎర్రిస్వామి

నవతెలంగాణ-కందనూలు



జిల్లా కేంద్రం సమీపంలో ఉన్న జిల్లా రవాణా శాఖ కార్యాలయం ఆవరణలో 37వ జాతీయ రోడ్డు భద్రత వారోత్సవాలు నిర్వహించినట్లు రవాణా శాఖ జిల్లా అధికారి ఎర్రిస్వామి తెలిపారు. ఈ కార్యక్రమంలో సుమారు 200మంది డ్రైవర్లు పాల్గొన్నారు. వారికి రోడ్డు భద్రత విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల పట్ల పలు సూచనలు చేసినట్లు వివరించారు. తప్పనిసరిగా టూ వీలర్‌పై వెళ్లే వారు హెల్మెట్ వాడాలన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపవద్దని, ఎంత అత్యవసరమున్న అతివేగం అవసరం లేదన్నారు. రోడ్డు ప్రమాదాల వల్ల ఏటా చాలామంది ప్రాణాలు కోల్పోతున్నారని దానివల్ల కుటుంబాలు రోడ్డున పడుతున్నారన్నారు. దానికి ముఖ్య కారణం అతివేగమే అన్నారు. కావున వాహనాలు నడిపేవారు తప్పనిసరిగా రోడ్డు భద్రతా నియమాలను పాటించాలని సూచించారు. ఈ రోడ్డు భద్రతా వారోత్సవాలు ఫిబ్రవరి 14 వరకు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్లు నవీన్, అనుప్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు బూట్లు పంపిణీ..?

- బ్యాగ్‌లు, టై బెల్ట్ ఇవ్వాలని యోచన



నవతెలంగాణ-అచ్చంపేట

ప్రభుత్వ పాఠశాలను పటిష్టపరిచేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తుంది. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు ఇప్పటికే పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం, నాలుగు జతల యూనిఫామ్‌లు, ఉచిత పాఠ్య పుస్తకాలు అమలు చేయడం జరుగుతుంది. గ్రామీణ ప్రాంతాలలో బడి బయట ఉన్న పిల్లలను బడివైపు మళ్లించడానికి ప్రభుత్వాలు నూతన విధానాన్ని అమలు చేస్తున్నాయి. అందులో భాగంగానే వచ్చే విద్యా సంవత్సరం నుంచి ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల కు బూట్లు, బ్యాగ్‌లు, టై బెల్టు ఇవ్వాలని ప్రభుత్వం భావిస్తుంది. సమగ్ర శిశు అభియాన్‌లో విద్యాశాఖ ప్రభుత్వానికి నివేదికలు సిద్ధం చేసింది. ఇది అమలు జరిగితే



నాగర్‌కర్నూల్ జిల్లాలో 70వేల మంది విద్యార్థులకు లబ్ధి చేకూరుతుంది. ప్రైవేటు పాఠశాలలో డ్రెస్‌కోడ్ ఏ విధంగా ఉంటుందో అదే విధం గా ప్రభుత్వ పాఠశాలలో కూడా అమలు చేయాలని ప్రభు త్వం భావిస్తుంది. కేంద్ర ప్రభుత్వం 60శాతం రాష్ట్ర ప్రభు త్వం 40శాతం నిధులు కేటాయించుకుని వచ్చే విద్యా సంవ త్సరంలో నూతన డ్రెస్ కోడ్ విధానాన్ని అమలు చేయాలని ప్రభుత్వం ఆలోచిస్తుంది. నాగర్‌కర్నూల్ జిల్లాలో ప్రాథమిక, ప్రాథమి కోన్నత, ఉన్నత, ఎయిడెడ్ పాఠశాలలు మొత్తం 848 పాఠ శాలలు ఉన్నాయి. వీటి పరిధిలో 76వేల మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. ప్రైవేట్ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు బూట్లు, బ్యాగ్‌లు, బెల్టు, టైలను తల్లిదండ్రులు కొనుగోలు చేస్తారు. తల్లిదండ్రులపై ఆర్థిక భారం పడుతుంది. ఈ విధానానికి స్వస్తి చెప్పాలనే ఉద్దేశంతో ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు ప్రభుత్వమే ఉచితంగా పై వస్తువులను ఇవ్వడానికి ప్రణాళి కా సిద్ధం చేస్తుంది. డిసెంబర్ 10 నుంచి జనవరి 11 వరకు విద్యాశాఖ అధికారులు బడి బయట ఉన్న విద్యార్థుల సర్వే నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా 310 విద్యార్థులు బడి బయట ఉన్నట్లు అధికారులు గుర్తించారు. విద్యా సంవత్సరంలో వీరందరినీ పాఠశా లలో చేర్పించే విధంగా అధికారులు చర్యలు తీసుకున్నారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి అమలైతే.. జిల్లాలో 70వేల మందికి పైగా విద్యార్థులకు లబ్ధి జరగనుంది.

ఆరోగ్యంగా ఉండాలంటే పోలీసులను ఆదర్శంగా తీసుకోవాలి

- రాష్ట్ర ఆబ్కారీ, సాంస్కృతిక పర్యాటక పురావస్తు శాఖ మంత్రి

నవ తెలంగాణ-కందనూలు

మనిషి ఆరోగ్యంగా ఉండేందుకు పోలీసులను ఆదర్శంగా తీసుకోవాలని రాష్ట్ర ఆబ్కారీ, సాంస్కృతిక పర్యాటక పురావస్తు శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. బుధవారం జిల్లా పరిషత్ మైదానంలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్పోర్ట్స్ మీట్ కార్యక్రమానికి రాష్ట్ర మంత్రి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ ఆరోగ్యంగా ఉండటానికి వయస్సుకు సంబంధం లేకుండా ప్రతి వ్యక్తి కనీస వ్యాయామం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఇందుకు పోలీస్ అధికారులను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. మనిషి ఆరోగ్యంగా ఉంటే మెదడు బాగా పనిచేస్తుందని తద్వారా మంచి విజయాలు సాధించవచ్చన్నారు. ప్రతి గ్రామంలో క్రీడా మైదానాలను ఏర్పాటు చేసి వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పోలీస్ అధికారులు, సైనికులు ప్రతి నిత్యం వ్యాయామం



చేస్తూ ఆరోగ్యంగా ఉంటారని అకుంఠిత కార్యదీక్ష వల్ల ఎక్కడ సమస్య ఉన్నా వెంటనే చేరుకొని పరిష్కరిస్తారన్నారు. పోలీస్ సిబ్బందికి స్పోర్ట్స్ మీట్ పెట్టినందుకు ఎస్పీ గైక్వాడ్ వైభవ్‌ను అభినందించారు. ఆటల్లో ఆసక్తి, ప్రతిభ ఉన్నవాటిని గుర్తించి ప్రత్యేక శిక్షణ ఇస్తూ ఒలింపిక్‌లో పాల్గొనే స్థాయికి ఎదగాలని అందుకు తన వంతు సహకారం అందిస్తానని తెలిపారు. ఒక్క పోలీస్ శాఖ మాత్రమే కాకుండా ఇతర శాఖల అధికారులు, సిబ్బంది, విద్యార్థులు ప్రతి ఒక్కరూ వ్యాయామం, ఆటల పోటీలలో పాల్గొనే విధంగా అవగాహన కల్పించాలని కలెక్టర్‌ను ఆదేశించారు. జిల్లాలో విద్యా వైద్యానికి ప్రతి ఒక్కరూ తమవంతు సహకారం అందించాలని కోరారు. కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్ మాట్లాడుతూ జిల్లాలో ఇంత పెద్దఎత్తున స్పోర్ట్స్ మీట్ జరగటం ఇదే తొలిసారని ఎస్పీను అభినందించారు. ఇదేస్ఫూర్తితో రాబోయే రోజుల్లో ఇతర శాఖల సిబ్బంది క్రీడల్లో భాగస్వాములు అయ్యే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. స్పోర్ట్స్ మీట్ సందర్భంగా పాలుపంచుకున్న పోలీస్ సిబ్బందికి అభినందనలు తెలిపారు. అనంతరం పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులకు మంత్రి చేతుల మీదుగా బహుమతులను ప్రధానం చేశారు. ఎస్పీ గైక్వాడ్ వైభవ్, అడిషనల్ ఎస్పీ రామేశ్వర రావు, డీఎస్పీ మోహన్ కుమార్, సీఐ విష్ణువర్ధన్ రెడ్డి, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ సిబ్బందికి కనీస వేతనాలు అమలు చేయాలి : సీఐటీయూ

నవ తెలంగాణ-కందనూలు

జిల్లా కేంద్రంలోని కలెక్టర్ సమీకృత ఆఫీసుల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ సిబ్బందికి కనీస వేతనం రూ.21వేలు అమలు చేయాలని సెంటర్ ఆఫ్ ఇండియన్ ట్రేడ్ యూనియన్ సీఐటీయూ ఆధ్వర్యంలో అదనపు కలెక్టర్ సీతారామ రావుకు సమస్యలతో కూడి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా నూతన కలెక్టరేట్ల నిర్మాణం పేరుతో వేల కోట్ల రూపాయలు ఖర్చుపెట్టి కొత్త భవంతులను నిర్మించి ఆధునిక సదుపాయాలు కల్పించిన రాష్ట్ర ప్రభుత్వం అందులో పని చేస్తున్న కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ సిబ్బందికి మాత్రం కనీస వేతనాలు అమలు చేయడంలో వివక్షత పాటిస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కేవలం 14మంది సిబ్బందితో నూతన కలెక్టరేట్ పరిశుభ్రంగా ఉంచడం ఎంతవరకు సాధ్యమని ఆయన రాష్ట్ర ప్రభుత్వాన్ని



ప్రశ్నించారు. కేవలం రూ.7వేలు వేతనమిచ్చి కనీసం పీఎఫ్, ఈఎస్ఐ అమలు చేయకుండా కార్మికుల శ్రమను దోచుకుంటున్నారన్నారు. గత ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు కాంట్రాక్టు వ్యవస్థను రద్దు చేస్తామని చెప్పిన పదేళ్ల గడిచిపోయిన కాంట్రాక్ట్ వ్యవస్థను రద్దు చేయకపోగా ఆ వ్యవస్థను పెంచి పోషించిందన్నారు. అందులో భాగంగా నూతన ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఇప్పటికైనా కార్మికుల కనీస వేతనాలు అమలు అవుతాయా లేదా అని కార్మికులు ప్రశ్నించుకుంటున్నారని ఆయన అన్నారు. కాబట్టి కలెక్టర్ కార్యాలయం సమీకృత ఆఫీసులో పనిచేస్తున్న సిబ్బందికి వెంటనే కనీస వేతనాలు అమలుచేసి ఈఎస్ఐ, పీఎఫ్ అమలు చేయాలని ఆయన రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అలివేలమ్మ, భాగ్యమ్మ, సుజాత, కృష్ణవేణి, ఎల్లమ్మ, మంజుల, వెంకటమ్మ అనసూయ, తదితరులు పాల్గొన్నారు.

పదవి కాలం ముగిసినా గ్రామాల అభివృద్ధిలో భాగస్వాములు కావాలి : మంత్రి







నవతెలంగాణ-పెద్దకొత్తపల్లి

సర్పంచ్ పదవి కాలం ముగిసినా సర్పంచ్‌లు గ్రామాల అభివృద్ధిలో భాగస్వాములై ముందుండాలని ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక మంత్రి జూపల్లి కృష్ణారావు సర్పంచ్లకు సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని నూతనగా నిర్మించిన ఎంపీడీవో కార్యాలయ హాలులో మండలంలోని సర్పంచుల సమావేశానికి అతిథులుగా మంత్రితో పాటు ఎంపీపీ సూర్య ప్రతాప్ గౌడ్, జడ్పీటీసీ మేకల గౌరమ్మ చంద్రయ్య యాదవ్ అన్ని గ్రామాల సర్పంచులను శాలువాలతో సన్మానించి మెమెంటోలను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఇంతకాలం గ్రామాల అభివృద్ధికి కృషి చేసిన సర్పంచులకు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే పార్టీలకతీతంగా గ్రామాల అభివృద్ధి కోసం సర్పంచులు భాగస్వాములై ముందుండి గ్రామ సమస్యలపై దృష్టి సారించాలన్నారు. ఈ కార్యక్రమంలో పెద్దకొత్తపల్లి సర్పంచ్ ఆదేర్ల వెంకటేశ్వర్ రెడ్డి, వెన్నచర్ల సర్పంచ్ రాధా బాలస్వామి, దేవుని తిరుమలాపూర్ సర్పంచ్ వి.సత్యం, పెరమాళ్లపల్లి సర్పంచ్ మానస విష్ణువర్ధన్ రెడ్డి, చిన్న కొత్తపల్లి సర్పంచ్ పెద్దిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, ముష్టిపల్లి సర్పంచ్ నాగమ్మ కురుమయ్య, ఆదిరాల సర్పంచ్ భాగ్యమ్మ కురుమయ్య, పెదకారపముల సర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి, యాపట్ల సర్పంచ్ రామేశ్వరరావు, కొత్త యాపట్ల సర్పంచ్ దేవేందర్ తో పాటు సర్పంచ్‌లను, ఎంపీటీసీలు, ఉప సర్పంచ్లు, అధికారులు పాల్గొన్నారు.

ఉప్పునుంతల : ప్రజలకు అందుబాటులో ఉండి అనునిత్యం సేవలు అందించిన వారిని ఎప్పుడు మరిచి పోరని అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ అన్నారు. బుధవారం ఎంపీపీ అరుణ నరసింహ రెడ్డి, పదవి కాలం ముగిస్తున్న సర్పంచులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ ప్రతాప్ రెడ్డి, సర్పంచుల సంఘం అధ్యక్షుడు బాలు నాయక్, ఎంపీడీవో లక్ష్మణ్ రావు, తిప్పర్తి నరసింహారెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కట్ట అనంతరెడ్డి, కాల్వ గోవర్ధన్ రెడ్డి, యాదవ రెడ్డి, ఎంపీటీసీలు రెడ్డి రంగారెడ్డి, సంబు భాస్కర్, గోపిరెడ్డి, అనురాధ, శ్యామల, ఇటిక్యాల కవిత, తిరుపతి రెడ్డి, అన్ని గ్రామాల సర్పంచులు పాల్గొన్నారు.

బిజినేపల్లి : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వచ్చే నిధులను సక్రమంగా వినియోగించి పల్లెలను అభివృద్ధి పర్చడంలో సర్పంచ్లదే కీలక పాత్ర అని ఎంపీపీ శ్రీనివాస్ గౌడ్, ఎంపీటీసీల సంఘం జిల్లా కన్వీనర్ మంగి విజయ్లు అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ సమావేశపు హాల్లో బుధవారంతో పదవి కాలం ముగిసిన సర్పంచ్లను శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించి మాట్లాడారు. అనంతరం పలువురు సర్పంచ్‌లు తమ అనుభవాలను పంచుకున్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కృష్ణయ్య, ఎంపీఓ రాములు నాయక్, సర్పంచ్లు బాలీశ్వర్, అశోక్, అవంతి, లావణ్య నాగరాజు, అమృత్ రెడ్డి, వంగ సుదర్శన్ గౌడ్, ముదావత్ సాలెమ్మ, ఎంపీటీసీలు ఆంజనేయులు, తిరుపతయ్య, రాధా తిరుపతి రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

స్టాఫ్ నర్సు ఉద్యోగ నియామకాల్లో వికలాంగులకు మొండి చెయ్యి : ఎన్‌పీఆర్‌డీ

కందనూలు : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం భర్తీ చేస్తున్న స్టాఫ్ నర్స్ ఉద్యోగ నియామకల్లో వికలాంగులకు మొండి చెయ్యి చూపిందని, సర్టిఫికెట్ల వెరిఫికేషన్ పూర్తయినా అపాయింట్మెంట్ ఆర్డర్స్ ఇవ్వకుండా రాష్ట్ర ప్రభుత్వం వికలాంగులకు మోసం చేస్తుందని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక (ఎన్‌పీఆర్‌డీ) తెలంగాణ రాష్ట్ర కమిటీ జిల్లా అధ్యక్షులు కోట్ల గౌతమ్, జిల్లా కార్యదర్శి పులిజాల బాలీశ్వర్ పేర్కొ న్నారు. తెలంగాణ రాష్ట్రంలోని ప్రభుత్వ ఆస్పత్రులు, గురుకుల విద్యాలయాలు, వివిధ ప్రభుత్వ సంస్థల్లో 7094 స్టాఫ్ నర్సు పోస్టుల భర్తీ కోసం వ్రాత పరీక్ష నిర్వహించారు. అర్హత కలిగిన అనేక మంది వికలాంగులు కూడా పరీక్ష రాసి ఉత్తీర్ణత సాధించినారు. కానీ రాష్ట్ర ప్రభుత్వం భర్తీ చేస్తున్న స్టాఫ్ నర్సు పోస్టుల్లో వికలాంగులతో భర్తీ చేయలేదు. ప్రభుత్వం భర్తీ చేస్తున్న 7094 పోస్టుల్లో 4శాతం ప్రకారం 283 పోస్టులు వికలాంగులతో భర్తీ చేయాలి. కానీ 138 పోస్టులు శారీరక వికలాంగులు లేరనే కారణంతో భర్తీ చేయడం లేదని ప్రభుత్వం ప్రకటించడం అంటే వికలాంగులను మోసం చేయడం తప్ప మరొకటి కాదన్నారు. ప్రభుత్వం అనేక మంది అభర్థుల సర్టిఫికెట్స్ పరిశీలన చేసింది. ప్రభుత్వం విడుదల చేసిన ఫైనల్ లిస్ట్‌లో పేర్లు వచ్చినప్పటికి ఈరోజు ఎల్‌బీ స్టేడియంలో సకలాంగులకు ఉద్యోగ నియామక పత్రాలు ఇస్తూ వికలాంగులకు మాత్రం మొండి చెయ్యి చూపిందన్నారు. సర్టిఫికెట్ పరిశీలన చేసిన వికలాంగుల అభర్థులకు వెంటనే నియామక పత్రాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

దేవాలయ అభివృద్ధికి నా వంతు సహకారం అందిస్తా : మంత్రి

నవతెలంగాణ-పెద్దకొత్తపల్లి

భక్తులకు కొంగు బంగారమై కోరిన కోరినలు కోరికలు తీర్చే తల్లిగా ప్రసిద్ధి చెందిన నాయనోనిపల్లి మైసమ్మ దేవత ఆలయ అభివృద్ధి కోసం తన వంతు సహకారాన్ని అందిస్తానని ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక జూపల్లి కృష్ణారావు అన్నారు. బుధవారం మండల పరిధిలోని నాయనోనిపల్లి గ్రామ శివారులో వెలసిన మైసమ్మ దేవాలయ ట్రస్ట్ చైర్మన్ పదవి మహోత్సవానికి ట్రస్ట్ చైర్మన్ బుడుగు శ్రీనివాసులు ఆహ్వానం మేరకు ఎక్సైజ్ పర్యాటక సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎంపీపీ సూర్య ప్రతాప్ గౌడ్, జడ్పీటీసీ మేకల గౌరమ్మ చంద్రయ్య యాదవ్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. అనంతరం నాయినోనిపల్లి మైసమ్మ దేవతను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. నాయినోనిపల్లి మైసమ్మ చైర్మన్‌గా ఎన్నికైన బుడుగు శ్రీనివాసులను మంత్రి, ఎంపీపీ, ఎంపీటీసీలతో పాటు పలువురు శాలువాలతో సన్మానించారు. అనంతరం మంత్రి, ఎంపీపీ, జడ్పీటీసీలను చైర్మన్ గొడుగు శ్రీనివాసులు, మైసమ్మ ఆలయ ఈవో రంగారావు శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో మారుతి రావు, ఆలయ సిబ్బంది, కొల్లాపూర్ మాజీ ఎంపీటీసీ హనుమంత నాయక్, పెద్దకొత్తపల్లి సింగిల్ విండో సిబ్బంది, సర్పంచ్‌లు ఆదేర్ల వెంకటేశ్వర్ రెడ్డి, పెద్దిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, వి.సత్యం, శ్రీనివాస్ రెడ్డి, రాధబాలస్వామి, ఎంపీటీసీలు రవికుమార్, శశికళ శివశంకర్, తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి

నవతెలంగాణ-తిమ్మాజిపేట



మండలంలోని ఇప్పలపల్లి గ్రామానికి చెందిన పొట్ట యాదయ్య అనుమా నాస్పద స్థితిలో మృతి చెందాడు. ఎస్ఐ భాస్కర్ రెడ్డి కథనం మేరకు వివరాలు.. ఇప్పలపల్లి గ్రామానికి చెందిన పొట్ట యాదయ్యతో పాటు మరో ఇద్దరు వ్యక్తులు మంగళవారం మద్యం తాగేందుకు ఇప్పలపల్లి నుండి తిమ్మాజిపేటకు వెళ్లారు. ఇద్దరు వ్యక్తులు మాత్రం ఇంటికి తిరిగి రాగా పొట్ట యాదయ్య (45) అనే వ్యక్తి మాత్రం గ్రామ శివారులో మృతిచెంది పడి ఉన్నాడు. యాదయ్య రాత్రికి ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు గ్రామంలో వెతికిన ఆచూకీ దొరకలేదు. తమకు తెలిసిన బంధువులకు ఫోన్ చేయగా యాదయ్య మా ఇంటికి రాలేదని సమాచారం వచ్చింది. బుధవారం ఉదయం మృతుడి తమ్ముడు శివ వ్యవసాయ పొలానికి వెళ్ళగా మృతుడి పొలానికి దగ్గరలో యాదయ్య మృతి చెందిపడి ఉన్నాడు. ఈ విషయాన్ని పోలీసులకు చెప్పడంతో సంఘటన స్థలానికి పోలీసులు చేరుకొని కుటుంబ సభ్యులతోనూ స్థానికులతోను వివరాలను అడిగి తెలుసుకున్నారు. మా నాన్నను ఇద్దరు వ్యక్తులు చంపి ఉంటారని మృతుడి కుమారుడు శివప్రసాద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు తెలిపారు.

16న సార్వత్రిక సమ్మె నోటీసు

నవతెలంగాణ-కందనూలు

ఫిబ్రవరి 16న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె నోటీసు జిల్లా సివిల్ సప్లై అధికారి డిఎం బాలరాజ్‌కి, ఐకేపీ వీఓఏ ఉద్యోగుల సంఘం ఆధ్వ ర్యంలో జిల్లా కేంద్రంలో సమ్మె నోటీసులను డీఆర్డీఏ ఆఫీసులో అందజేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు పర్వతాలు, జిల్లా కోశాధికారి అశోక్, హమాలి సంఘం రాష్ట్ర కార్యదర్శి బాలయ్య, నాయకులు నరేందర్, సాయిలు, గోపాల్, శివ, పవన్, ఐకేపీ వీఓఏల సంఘం రాష్ట్ర అధ్యక్షులు రాజకుమార్, రాష్ట్ర కోశాధికారి సుమలత, జిల్లా కోశాధికారి మల్లేష్, జిల్లా నాయకులు సునీత, మహమ్మద్ బేగం, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శ్రీకారం

నవతెలంగాణ-ఉప్పునుంతల

మండలంలోని ఉప్పరిపల్లి, జప్తి సదగోడు, మండల కేంద్రంలో, తాడూర్, కోరటికల్, వెల్టూర్ గ్రామంలో సీసీ రోడ్లు, నూతనా గ్రామపంచాయతీ, హెల్త్ సెంటర్లు, సింగిల్ విండో భావనాలను ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ ప్రారంభం, శంకుస్థాపనలు చేశారు. 'సర్వసభ్య సమావేశం' ఉప్పునుంతల మండల ఎంపీపీ అరుణ నర్సింహా రెడ్డి అధ్యక్షతన సాధారణ సర్వసభ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచెయ్యాలని ప్రజలకు ఏలాంటి సమస్యలు రాకుండా చూడాలని కోరారు. హాజరైన వివిధ శాఖల అధికారులను గ్రామాలలో సమస్యల పట్ల, విద్య అంగ న్వాడి, రేషన్, విద్యుత్ సరఫరా, తాగునీరు, వలు సమస్యల పైన వివరంగా అడిగి తెలుసుకున్నారు. వివిధ శాఖల అధికారులు మూడు నెలలకు ఒకసారి జరిగే సర్వసభ్య



సమావేశానికి హాజరుకావాలని తెలిపారు. గైర్హాజరు అయిన అధికారు లను గుర్తించి కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామన్నారు. ప్రభుత్వ పరంగా అధికారులకు, ప్రజలకు అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీడీవో లక్ష్మణరావు, తహసిల్దార్ తబితారాణి, మండల అధ్యక్షులు కట్ట అనంత రెడ్డి, జడ్పీటీసీ ప్రతాప్ రెడ్డి, నర్సింహా రెడ్డి, వైస్ ఎంపిపి వెంకటేష్, ఉప్పునుంతల సర్పంచ్ సరిత రెడ్డి, రఘుపతి రెడ్డి, రంగారెడ్డి, మల్ల రెడ్డి, యువజన కాంగ్రెస్ నాయకులు వెల్టూరి రేణయ్య, రాత్లావత్ కృష్ణ, శేఖర్ గౌడ్, మొగిలి మహేష్, గోవిందు సింగ్, భాస్కర్, రామచంద్రయ్య, సోషల్ మీడియా కోర్డినేటర్ శ్రీహరి అన్ని గ్రామాల సర్పంచులు, ఎంపిటిసిలు, తదితరులు పాల్గొన్నారు.

సామాజిక తెలంగాణ ఏర్పాటే గద్దర్‌కు ఘన నివాళి

• జిల్లా చైర్మన్ గొంగళ్ల రంజిత్ కుమార్



ధరూర్ : గద్దర్ జయంతి సందర్భంగా మండలంలోని వివిధ గ్రామాలలో నడిగడ్డ హక్కుల పోరాట సమితి జిల్లా చైర్మన్ గొంగళ్ల రంజిత్ కుమార్ ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా గొంగళ్ల రంజిత్ కుమార్ మాట్లాడుతూ ప్రజా యుద్ధ నౌక, కవి , గాయకుడు గద్దర్ తన ఆటపాటలతో తెలంగాణ సమాజాన్ని ఉత్తేజ పరిచారని, తెలంగాణ రాష్ట్రంలో వెనుకబడిన పరిస్థితులు ఆకలి కేకలను తన పాటలతో ప్రజల కళ్లకు కట్టినట్టు చేశారని అన్నారు. గద్దర్ కలలుగన్న సామాజిక తెలంగాణ ఏర్పడిన నాడే ఆ మహనీయునికి ఘనమైన నివాళులు అర్పించిన వారమవుతారమని అన్నారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్ బుచ్చిబాబు, శ్రీనివాస్ యాదవ్, నాగరాజు, మల్దకల్ మండల అధ్యక్షుడు విష్ణు,ప్రేమ్ రాజ్, రంగస్వామి, గోపాల్, దొడ్డన్న రాముడు తదితరులు పాల్గొన్నారు.

హుండీ లెక్కింపు



అలంపూర్ : జోగులాంబ బాలబ్రహ్మేశ్వర ఆలయాల హుండీ లెక్కింపులో భాగంగా బుధవారం బాల బ్రహ్మేశ్వర స్వామి వారి ఆలయ హుండీ లెక్కింపు నిర్వహించారు. ఈ హుండీ లెక్కింపు ద్వారా 18 లక్షల 31 వేల 708 ఆదాయం ఆలయానికి సమకూరినట్లు, అన్నదాన సత్రం హుండీ ద్వారా 47 వేల 780 ఆదాయం వచ్చిందని, మొత్తం కలిపి 18 లక్షల 79వేల 488 రూపాయల ఆదాయం ఆలయానికి సమకోరినట్లు ఆలయ కార్యనిర్వాహణాధికారి పురేందర్ కుమార్ తెలిపారు. ఈ లెక్కింపు ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా సహాయ కమీషనర్ జి. శ్రీనివాసరాజు పర్యవేక్షణలో నిర్వహించబడినది. ఈ హుండీ లెక్కింపు కార్యక్రమములో ఆలయ చైర్మన్ చిన్న కృష్ణయ్య, ఉప ప్రధాన అర్చకుడు ఆనంద్ శర్మ, ధర్మకర్తల మండలి సభ్యులు వెంకటేశ్వర్ రెడ్డి, వెంకటనారాయణ, సత్యనారాయణ, సత్యన్న, రంగుధనుంజయ, అలంపూర్ ఏపీజీవిబీ బ్రాంచ్ మేనేజర్, స్థానిక, స్థానికేతర భక్తులు తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్‌కు తరలిన స్టాఫ్‌నర్సులు



జోగులాంబ గద్వాల : రాష్ట్ర వ్యాప్తంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా జిల్లా లో ఎంపికైన 107 మంది స్టాఫ్‌నర్స్ లకు (నర్సింగ్ ఆఫీసర్స్‌కి) నియామక పత్రాలు అందజేస్తున్న సందర్భంగా జిల్లా నుంచి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాఫ్ నర్సులు బయలుదేరే బస్సును కలెక్టర్ బీ ఏం సంతోష్, రెవెన్యూ కలెక్టర్ చీర్ల శ్రీనివాస్‌లు జెండా ఊపి ప్రారంభించారు. బుధవారం జిల్లా ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో స్టాఫ్ నర్సులు బయలుదేరారు. జోగులాంబ గద్వాల జిల్లా వైద్య ఆరోగ్యశాఖ పరిధిలో మొత్తం 107 మంది స్టాఫ్ నర్స్ (నర్సింగ్ ఆఫీసర్స్)గా ఎంపికయ్యారని, వీరందరికీ బుధవారం మధ్యాహ్నం 3గంటలకు హైదరా బాదులోని ఎల్బీ స్టేడియంలో ముఖ్యమంత్రి చేతుల మీదుగా నియమక పత్రాన్ని అందజే స్తున్నారని తెలిపారు. జిల్లా ఐ డీ ఓ సీ కార్యాలయం నుంచి ఉదయం, మూడు (3) ప్రత్యేక బస్సుల్లో స్టాఫ్ నర్స్‌లందరిని హైదరాబాద్‌కి తీసుకెళ్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శశికళ, అంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహించాలి

• ఇంటర్మీడియట్ జిల్లా విద్యాధికారి హృదయరాజు



ఉండవల్లి : ఇంటర్మీడియట్ ప్రాక్టికల్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని ఇంటర్మీడియట్ జిల్లా విద్యాధికారి హృదయ రాజు అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని మహాలక్ష్మి ఆదిలక్ష్మి దేవమ్మ డిగ్రీ కళాశాలలో అధ్యాపక బృందంతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ. గురువారం నుంచి ప్రాక్టికల్ పరీక్షలు కొనసాగుతున్నాయని జిల్లాలో మొత్తం 33 సెంటర్లోనూ చీఫ్ సూపర్ డాన్స్ డిపార్ట్మెంట్ల అధికారులుగా ఇచ్చినట్లు వారి తెలిపారు చీఫ్ సూపర్డెంట్ గా 33 మందిని తీసుకొని డిపార్ట్మెంట్ ఆఫీసర్లుగా 12 మందిని ఎంపిక చేసినట్లు. మొత్తము 6, 318 మంది విద్యార్థులు ప్రయోగ పరీక్షలు హాజరవుతున్నారని వారు తెలిపారు. విద్యార్థులకు అన్ని వసతులు సౌకర్యాలు కల్పించాలని ప్రతి సెంటర్లో పరీక్షలు సకాలంలో నిర్వహించి విద్యార్థులు ఇబ్బందులు లేకుండా చూడాలని వారి కోరారు ఈ కార్యక్రమానికి జిల్లా పరీక్షల నిర్వహణ కమిటీ సభ్యులు శ్రీ రమేష్ శ్రీమతి సృజన గారు ప్రధాన చారులు శ్రీ వీరన్న గారు కృష్ణ గారు శ్రీమతి పద్మావతి గారు అధ్యాపకు బృందం పాల్గొన్నారు.

ఎమ్మెల్సీలను సన్మానించిన జిల్లా ఎన్‌ఎస్‌యూఐ అధ్యక్షుడు అవెజ్ అహ్మద్



మహబూబ్‌నగర్ : ఎమ్మెల్యే కోటాలో ఎమ్మెల్సీలుగా ఏకగ్రీవంగా ఎన్నికై గురువారం ప్రమాణస్వీకారం చేసిన ఎన్ఎస్ యూఐ రాష్ట్ర అధ్యక్షుడు బల్మూరి వెంకట్, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్ కుమార్ గౌడ్ లను జిల్లా ఎన్ఎస్ యూఐ అధ్యక్షుడు మహ్మద్ అవేజ్ అహ్మద్ హైదరాబాదులో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారిని శాలువాలతో సత్కరించారు. అవేజ్ అహ్మద్ మాట్లాడుతూ విద్యార్థి సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తున్న బల్మూరి వెంకట్ సేవలను పార్టీ అధిష్ఠానం గురించి సముచితస్థానం కల్పించి ఎమ్మెల్సీ అవకాశం ఇవ్వడం సంతోషంగా ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీలో యువతకు తగిన ప్రాధాన్యత ఇస్తారన్నడానికి బల్మూర్ వెంకట్ కు ఎమ్మెల్సీ ఇవ్వడమేనని తెలిపారు.

సర్పంచులకు సన్మానం



బాలానగర్ : బాలానగర్ మండలంలోని 37 గ్రామపంచాయతీలు ఉన్నాయి. గత ఐదు సంవత్సరాల నుంచి సర్పంచులు ఐదు సంవత్సరాలు పదవీ కాలం పూర్తి కావడంతో గ్రామ కార్యదర్శులు , అధికారులు సర్పంచులను అధికారులు బుధవారంతో ముగియటంతో బుధవారం బాలానగర్ మండల కేంద్రంలో పెద్దాయపల్లిశివారులో ఉన్న రైతు వేదిక భవనంలో మండల శాఖ అధికారులు గ్రామ కార్యదర్శులు ఆయా గ్రామాలకు చెందిన సర్పంచులను శాలువాలతో సత్కరించి వీడ్కోలు పలికారు. అనంతరం సర్పంచులు మాట్లాడుతూ కొంతమంది సర్పంచులు నిధులు లేక అప్పులు తెచ్చి పెట్టిన సంగతి విధితమే. ఇప్పటికైనా ప్రభుత్వం చేసిన పనులకు బిల్లులు చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల అభివృద్ధి అధికారి కృష్ణారావు , ఏపీఓ మండల వ్యవసాయ శాఖ అధికారి ప్రశాంత్ రెడ్డి, సర్పంచ్ల సంఘం మండల అధ్యక్షుడు తిరుపతి నాయక్ కార్యదర్శి ఇప్పనూరు శంకర్ తోపాటు వివిధ గ్రామాలకు చెందిన సర్పంచులు కార్యదర్శిలు తాము చేసిన అభివృద్ధి పనులను గుర్తు చేశారు.



16న జాతీయ కార్మిక సమ్మెను జయప్రదం చేయండి

• చెత్త సేకరణ ఆటో కార్మికులను తొలగించొద్దు
• పెండింగ్ జీతాలు చెల్లించాలి
• పీఎఫ్ , ఈఎస్ఐ జమజేయాలి
• సీఐటీయూ జిల్లా అధ్యక్షులు ఏ. వెంకటస్వామి, మున్సిపల్‌యూనియన్ జిల్లాఅధ్యక్షులు వీ. గట్టన్న



జోగులాంబ గద్వాల : దేశవ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా కేంద్ర కార్మిక సంఘాలు కిసాన్ సంయుక్త మోర్చా ఆధ్వర్యంలో ఫిబ్రవరి 16న తలపెట్టిన దేశవ్యాప్త కార్మిక సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షులు ఏ. వెంకట స్వామి, తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షులు గట్టన్న కోరారు. బుధవారం స్థానిక సీఐటీయూ జిల్లా కార్యాల యంలో తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ సీఐటీయూ అనుబంధం జిల్లా కమిటీ సమావేశం శివన్న అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో వారు మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం కార్మిక చట్టాల సవరణను ఉపసంహరించుకొని, నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రూ.26 వేల కనీస వేతనం నిర్ణయించాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ కార్మికులకు పెండింగ్‌లో ఉన్న జీతాలను వెంటనే చెల్లించాలని, పీఎఫ్, ఈఎస్ఐ డబ్బులను వెంటనే కార్మికుల ఖాతాలో జమజేయాలని, సబ్బు, నూనె, డ్రస్సులు ఇవ్వాలని అన్నారు. గద్వాల మున్సిపాలిటీలో చెత్తసేకరణ చేసే ఆటో కార్మి కులను తొలగించేం దుకు ప్రయత్నాలు జరుగు తున్నట్టుగా తెలిసిందని, కార్మికుల తొలగింపు ప్రయత్నాలను వెంటనే విరమించుకోవాలని డిమాండ్ చేశారు. లేనిచో ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు. పారిశుద్ధ్య సేవల్లో ప్రైవేటీకరణ చర్యలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. పట్టణం పెరు గుతున్న కొద్దీ జనాభా పెరుగుదలకు అనుగుణంగా కార్మి కుల సంఖ్యను పెంచా ల్సింది పోయి కార్మికులను తగ్గించడం తగదని అన్నారు. జిల్లాలోని అన్ని మున్సిపాలిటీలలో కొత్తగా నియమిం చుకున్న కార్మికులకు కూడా పాత కార్మికులతో సమానంగా జీతాలు చెల్లించాలని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా నాయకులు శివ, నరసింహ, శివన్న, రాజేష్, సుధాకర్, రవి, రాము, దౌలమ్మ తదితరులు పాల్గొన్నారు.

కోదండరాం ఎమ్మెల్సీపై కేసీఆర్ కుట్ర

• నిరసన కార్యక్రమంలో టీజేఎస్ అఖిలపక్షాలు, ప్రజా సంఘాలు



నవ తెలంగాణ - జోగులాంబ గద్వాల

కోదండరాంపై కేసీఆర్ కుట్ర నీచ రాజకీయాలను నిరసిస్తూ తెలంగాణ జన సమితి రాష్ట్ర పిలుపు మేరకు బుధవారం జోగులాంబ గద్వాల జిల్లా తెలంగాణ జన సమితిపార్టీ కార్యాలయం నుంచి అమరవీరుల స్తూపం వరకు ర్యాలీగా వెళ్లి అమరులకు శ్రద్ధాంజలి ఘటించి కృష్ణవేణి చౌక్ వద్ద అఖిల పక్ష, ప్రజా సంఘాల నాయకులను కలుపుకొని తెలంగాణ జన సమితి జోగులాంబ గద్వాల జిల్లా కన్వీనర్ ఆలూరు ప్రకాష్ గౌడ్ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ప్రజాస్వామ్యాన్ని రక్షించాలని, కోదండరాం సార్ నాయకత్వం వర్ధిల్లాలని, కేసీఆర్ డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ జన సమితి జోగులాంబ గద్వాల జిల్లా కన్వీనర్ ఆలూరు ప్రకాష్ గౌడ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధనకు సబ్బండ ప్రజలను కూడగట్టుకుని అలుపెరుగని పోరాటంలో ఎందరో అమరులయ్యారని , వారి త్యాగాల ఫలితంగా ఆ నాటి కాంగ్రెస్ పార్టీ గుర్తించి తెలంగాణ రాష్ట్రంను ప్రకటించిందన్నారు. ఇచ్చిన తెలంగాణను బంగారు తెలంగాణతో మభ్యపెట్టి దొరల,కుటుంబ పాలనకు శ్రీకారం చుట్టి మిగులు బడ్జెట్‌తో ఉన్న తెలంగాణ రాష్ట్రంను అప్పుల తెలంగాణగా మార్చారన్నారు. తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన కోదండరాం పోరాటం గుర్తించి రాష్ట్ర ప్రభుత్వం ఎమ్మెల్సీ పదవికి సిఫారసు చేస్తే గవర్నర్ ఆమోదం జీర్ణించుకోలేని కేసీఆర్ కోదండరాంపై కుట్రకు తెర లేపారని, నిజాయితీ పరులను ఉద్యమ కారులను అణిచివేతనే ధ్యేయంగా పెట్టుకున్న కేసీఆర్ తెలంగాణ ప్రజలు ఓడించినఇంకా అధికారంలో ఉన్నానని భ్రమల్లో ఉన్నారని , ఆయన అక్రమ సంపాదన బయటకి తీస్తే తప్పా భ్రమల నుంచి బయటకు రారని ఆయన అ న్నారు. సీపీఐ జిల్లా నాయకులు ఆంజనేయులు మాట్లాడుతూ కేసీఆర్ ద్వంద వైఖరి తప్పుపడుతూ ప్రొఫెసర్ కోదండరాం నిబద్ధత కలిగిన ఉద్యమ నాయకుడు అని, ఆయన పట్ల కేసీఆర్ ప్రవర్తిస్తున్న తీరును ఖండించారు. పాలమూరు అధ్యయన వేదిక కో కన్వీనర్ ఇక్బాల్ భాష మాట్లాడుతూ మేధావుల పట్ల కేసీఆర్ వైఖరి తేట తెల్లం అయిందని, కోదండరాం అడ్డుకోవడం అంటే తెలంగాణ హక్కు అభివృద్ధి అడ్డుకున్నట్లే ఈ దిగజారుడు చర్యను పూర్తిగా ఖండిస్తున్నామని అన్నారు. ప్రజా సంఘాల నాయకులు ప్రభాకర్ మాట్లాడుతూ ప్రొఫెసర్ కోదండరాం ఎమ్మెల్సీకావడం కేసీఆర్ జీర్ణించు కోక పోవడం దురదృష్టకరం, తెలంగాణకు అలుపెరుగని పోరాటం చేసిన కోదండరాం ను అడ్డుకోవడం అంటే కేసీఆర్ పూర్తి పతన వ్యవస్థకు వచ్చినట్లే లెక్క అని అన్నారు. అఖిలపక్ష నాయకులు వాల్మీకి మాట్లాడుతూ కేసీఆర్ వైఖరిని పూర్తిగా ఖండిస్తున్నామని , రాబోయే రోజుల్లోఎమ్మెల్సీగా కోదండరాం ప్రజల మధ్యకు వచ్చి ప్రజా సమస్యల పట్ల దృష్టి సారిస్తున్నరని అన్నారు. రైతు సంఘ నాయకులు గోపాల్ రావు మాట్లాడుతూ కోదండరాం తెలంగాణ రాష్ట్ర సాధనలో కేసీఆర్‌ను కలుపుకొని పోయి , ఉద్యమం చేసిన సందర్భాలు ఇప్పుడు ధ్యాస లేవన్నారు. తెలంగాణ ప్రజలకు తెలంగాణ మేధావులను ఎలా కాపాడు కోవాలో తెలుసని, రాబోయే రోజుల్లో సత్యం నిలుస్తుందని కోదండరాం ఎమ్మెల్సీగా ప్రమాణ స్వీకారం చేసి ప్రజల మధ్యకు వస్తారని ధీమా వ్యక్తం చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో తెలంగాణ జన సమితి జోగులాంబ జిల్లా కన్వీనర్ ఆలూరు ప్రకాష్ గౌడ్ , తెలంగాణ జన సమితి యువజన విభాగ ప్రధాన కార్యదర్శి మహబూబ్ పాషా, మధు , రాజు , ఇస్మాయిల్ , నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మాంటిస్సోరిలో అమరవీరుల దినోత్సవం



అలంపూర్ : అలంపూర్ పట్టణంలోని మాంటిస్సోరి పాఠశాలలో గాంధీజీ వర్ధంతి సందర్భంగా అమరవీరుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పీ. నాగలక్ష్మి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహి ంచారు. కొంతమంది విద్యార్థులు దేశం కోసం ప్రాణాలర్పించిన అమరుల గురించి ప్రసంగాలు, నినాదాలు చేశారు. దేశం కోసం జరిగిన స్వాతంత్ర్య ఉద్యమానికి సంబంధించిన స్కిట్ల ద్వారా కళ్ళకు కట్టినట్లు ప్రదర్శించారు. అమరులైనటువంటి వీరుల త్యాగాలను పాటల ద్వారా ప్రదర్శించారు. విద్యార్థిని విద్యార్థులు అమరవీరుల వేషధారణలతో ఏకపాత్రా భినయాలను, స్వాతంత్ర ఉద్యమ ఘట్టాలను ప్రదర్శించారు. తేరిమిట్టిమే అనే హిందీ పాట ఎంతో అద్భుతంగా అందరిని ఆకట్టుకున్నది. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ కెఎన్. వి. రవి ప్రకాశ్ మాట్లాడుతూ స్వాతంత్ర్యం ఎంతోమంది వీరుల ఫలితంగా వచ్చిందని, ప్రతి సంఘటన హృదయాలను కదిలించే విధంగా ఉన్నాయని, వీరమరణం పొందిన అమరవీరుల త్యాగాలు కొనియాడదగినవని విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమం విజయవంతంగా చేయడానికి కృషి చేసిన ఉపాధ్యా యులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే సోదరుడికి గ్రామస్తుల వినతి



రాజాపూర్ : మండలంలోని తిరుమలాపూర్ గ్రామంలో గ్రామ అభివృద్ధి కోసం గ్రామంలోని పలు సమస్యలపై వినతి పత్రం అందజేసిన గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు పలు సమస్యల దృశ్య జడ్చర్ల శాసనసభ్యులు జనంపల్లి అనిరుద్ రెడ్డి సోదరుడు మహబూబ్నగర్ జిల్లా మాజీ అధికార ప్రతినిధి దుశాంతు రెడ్డికి వినతిపత్రం అందించారు. గ్రామాలలో పశువుల దావకాన, అంగన్వాడీ భవనం, ఆర్టీసీ బస్సు జడ్చర్ల నుంచి నవాబుపేట వరకు(వయ: రాజాపూర్, తిరుమలాపూర్, దొండ్లపల్లి),మహిళా సంఘం భవనం, సీసీ రోడ్లు, అండర్ డ్రైనేజీ పనుల కావాలని కోరడం జరిగింది. ఇట్టి విషయంపై సానుకూలంగా స్పంది ంచి పలు అభివృద్ధి కార్యక్రమాలను త్వరలోనే ప్రారంభిద్దామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కే.సత్యనారాయణ గౌడ్, రెండవ వార్డ్ సభ్యులు మేకల శ్రీనివాస్, రాజపూర్ మండల కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా కో-ఆర్డినేటర్ చింతకింది కృష్ణ, యూత్ కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి బి.రమేష్ కుమార్, ఓబీసీ సెల్ గ్రామ అధ్యక్షులు ఎం.ఆంజనేయులు, గ్రామ సీనియర్ నాయకులు పీ. చంద్రయ్య పాల్గొన్నారు.

పీహెచ్‌సీని ప్రారంభించిన ఎమ్మెల్యే



ధరూర్ : గద్వాల నియోజకవర్గం ధరూర్ మండలంలోని అల్వాలపాడు గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ,సెంట్రల్ లైటింగ్ ను ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి ప్రారంభించారు.గ్రామంలో సెంట్రల్ లైటింగ్ ను ఎమ్మెల్యే స్విచ్ ఆన్ చేసి ప్రారంభించారు. ఎమ్మెల్యేను సర్పంచ్, బీఆర్ఎస్ పార్టీ నాయకులు శాలువా కప్పి పుష్పగుచ్చం ఇచ్చి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని అన్ని రకాల వైద్య సదుపాయాలులతో వైద్య, వైద్యసిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండి మెరుగైన వైద్య సేవలను అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీలు పద్మా వెంకటేశ్వర్ రెడ్డి, రాజశేఖర్ , వైస్ ఎంపీపీ సుదర్శన్ రెడ్డి, సర్పంచ్ వీరన్న గౌడ్, ఉపసర్పంచ్ ,బీఆర్ఎస్ పార్టీ నాయకులు శ్రీనివాస్ రెడ్డి, వెంకటేశ్వర్ శెట్టి, శ్రీకాంత్, నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

నూతన వంతెన (బ్రిడ్జి) ప్రారంభం



ధరూర్ : ధరూర్ మండలంలోని ర్యాలంపాడు గ్రామంలో నూతన కాలువపై వంతెన బ్రిడ్జీని సర్పంచ్ కర్రెమ్మ ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ధరూర్ మండల వైస్ ఎంపీపీ సుదర్శన్ రెడ్డి హాజరై మాట్లాడుతూ గ్రామ ప్రజలు తమ పంట పొలాలకు వెళ్లడానికి అనేక ఇబ్బందులు పడుతున్నారని, గ్రహించి మన స్థానిక శాసనసభ్యులు బండ్ల కృష్ణమోహన్ రెడ్డి సహకారంతో ఈ వంతెన నిర్మాణం చేయడం జరిగిందని పేర్కొన్నారు.గ్రామాభివృద్ధికి సహాయ,సహకారాలు అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ చిట్టెం వెంకటరామిరెడ్డి , మాజీ సర్పంచులు అంపన్న, దౌలన్న, ధరూర్ మండల యూత్ అధ్యక్షుడు పురుషోత్తం రెడ్డి, రంగారెడ్డి, లక్ష్మన్న, రంగన్న గౌడ్, నాగన్న, సురేష్, తిమ్మప్ప, మద్దిలేటి, నరసిం హులు, వెంకటేష్, వార్డు మెంబర్‌లు, గ్రామ పెద్దలు , యువకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

తప్పెట్ల, మొర్సు విద్యార్థుల ప్రతిభ



గట్టు : గద్వాల జిల్లా కేంద్రంలో నిర్వహించిన ఎన్ టీ ఎస్ ఎఫ్ ఆధ్వర్యంలో ప్రతిభ పోటీలలో తప్పెటమొర్సు విద్యార్థులు ప్రతిభ చాటారు. జెడ్.పీ. హెచ్.ఎస్ తప్పెట మొర్సు పాఠశాలకు చెందిన విద్యార్థిని సౌభాగ్య జిల్లాస్థాయిలో మొదటి బహుమతిని పొందారు. అలాగే గట్టు మండలంకు సంబంధించిన రెండు బహుమతులను కూడా తప్పెట మొర్సు విద్యార్థులు మొదటి బహుమతి మధులత, రెండో బహుమతి నేహా బహుమతులు సాధించిన విద్యార్థులను అడిషనల్ కలెక్టర్ అపూర్వ చౌహన్ అభినందించారు. ఈ ఘనతకు కారకులైన పాఠశాల ప్రధానోపాధ్యాయులను, సహచర ఉపాధ్యాయులను ముఖ్యంగా సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడు అశోక్ కుమార్‌లను గ్రామస్తులు అభినందించారు.

సర్పంచులకు శుభాకాంక్షలు

రాజాపూర్: బాలానగర్, రాజాపూర్ మండలంలోని గ్రామ పంచాయతీలలో గ్రామ సర్పంచ్‌గా ఎన్నికై ఐదు సంవత్సరాలు పూర్తి చేసుకున్న వారికీ కొర్ర హతిరామ్ నాయక్ శుభాకాంక్షలు తెలిపారు. గ్రామాల అభివృద్ధి కోసం ఎంతో ఉత్సాహంతో అభివృద్ధి పయనంలో నడి పించి, ఒక పక్క కరోనా మరొక పక్క నిధులు రాక సర్పంచులు ఆత్మహత్యలు చేసుకుంటున్న గానీ....మీ గ్రామానికి కానీ మన ప్రజానీకానికి కానీ ఎటువంటి బాధలు, కష్టాలు గానీ తేలవకుండా అభివృద్ధి చేసుకుంటూ ముందుకు వెళ్తు, ఎప్పుడు రాని అవార్డ్ లు మీ కాలం లో జాతీయస్థాయి రాష్ట్రస్థాయి, జిల్లాస్థాయి అవార్డ్ లు పొంది , గ్రామాన్ని ఉన్నత శిఖరంలో ఉంచి ఎనలేని సేవ చేసి విజయ వంతంగా ఐదు సంవత్సరాల పదవీకాలం ముగించుకున్న సర్పంచులందరికి పదవి విరమణ శుభాకాంక్షలు తెలిపారు.



జీ.పీ భవనాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే

క్రిష్ణా : మండలంలోని ఖాన్ దొడ్డి గ్రామంలో నూతనంగా నిర్మించిన గ్రామపంచాయతీ భవనాన్ని బుధవారం మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి తో పాటు సర్పంచ్‌జయలక్ష్మితిప్పయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి చిన్న గ్రామంలో కూడా అన్ని ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందే విధంగా ప్రభుత్వం దృష్టి సారిస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పూర్ణిమ పాటిల్, ఉప సర్పంచ్ సంగోల అశోక్, ఎంపీటీసీ మేకల రామచంద్ర, సింగల్ విండో డైరెక్టర్ సోమశేఖర్ గౌడ్, శ్రీనివాసులు, గ్రామ కార్యదర్శి నరసింహ రెడ్డి, వార్డు మెంబర్లు, గ్రామస్తులు యువకులు తదితరులు పాల్గొన్నారు.

ధరణి గ్రూప్ ఆఫ్ఇన్‌ఫ్రా డెవలపర్స్‌లో ఉద్యోగాలకు ఇంటర్వ్యూ



నారాయణపేట టౌన్ :

ధరణి గ్రూప్ ఆఫ్ ఇన్ ఫ్రా డెవలపర్స్ కంపెనీలో ఉద్యోగాలకు ఇంటర్వ్యూ హైదరాబాద్ లో ధరణి గ్రూప్ ఆఫ్ ఇన్ ఫ్రా డెవలపర్స్ కంపెనీలో 100 పోస్టుల ఉద్యోగాల కోసం నారాయణపేట జిల్లాలోని డి ఆర్ డీ ఏ ట్రైనింగ్, స్కిల్ సెంటర్ లో ఫిబ్రవరి 3న ఉదయం 10:30 గంటల నుంచి 1:30 గంటల వరకు ఇంట ర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ కోయ శ్రీహర్ష బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని నిరుద్యోగ యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇంటర్వ్యూలో ఎంపికైన అభ్యర్థులకు హైదరాబాద్ ధరణి గ్రూప్ ఆఫ్ ఇన్ ఫ్రా ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో నెలకు రూ.25 వేల వేతనం ఉంటుందని తెలిపారు. మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ లీడర్స్ పోస్టులకు 10వ తరగతి ఆపై అర్హత కలిగి 18 సంవత్సరాలు పైబడిన యువకులు నేరుగా తమ సర్టిఫికెట్లతో నారాయణపేట లోని డీఆర్డీఏ ట్రైనింగ్, స్కిల్ సెంటర్ కు హాజరు కావాలని తెలిపారు. ఈ పోస్టులకు ఎలాంటి అనుభవం అవసరం లేదని కలెక్టర్ తెలిపారు. వివరాలకు 9392121201 నంబరును సంప్రదించాలన్నారు.

సర్కిల్ ఇన్స్పెక్టర్ గా బాధ్యతల స్వీకరణ



ఊట్కూర్ : మక్తల్ నూతన సర్కిల్ ఇన్స్పెక్టర్ గా జి. చంద్రశేఖర్ బుధవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఇంతకుముందు మహబూబ్ నగర్ జిల్లా ఉమెన్ పోలీస్ స్టేషన్ లో సిఐ గా విధులు నిర్వర్తించి బదిలీపై మక్తల్ సిఐ గా రావడం జరిగింది.ఇంతకుముందు మక్తల్ సీఐగా ఉన్న రామ్ లాల్ ఐజిపి ఆఫీసుకు బదిలీ అయ్యారు. మక్తల్ నూతన సిఐ గా పదవి బాధ్యతలు తీసుకున్న అనంతరం జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్ ఐపీఎస్ నిపూల బొకే అందించి మర్యాదపూర్వకంగా కలవడం జరిగింది. ఈ సందర్భంగా ఎస్పీ శుభాకాంక్షలు తెలిపి సర్కిల్ పరిధిలోని ప్రజలకు అందుబాటులో ఉంటూ ఎలాంటి సమస్యలు లేకుండా శాంతిభద్రతలు పరిరక్షించాలని సూచించారు.అనంతరం మక్తల్ సిఐ మాట్లాడుతూ%" % మక్తల్ ప్రజలకు అందుబాటులో ఉంటు శాంతి భద్రతలు పరిరక్షించడం జరుగుతుందని, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారి పట్ల కఠినంగా వ్యవహరిస్తామన్నారు. మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటమన్నారు

ధన్వాడ నూతన ఎస్సైగా రమేష్



ధన్వాడ : పోలీస్ స్టేషన్ నూతన SHOగా SI వీ.రమేశ్ బుధవారం బాధ్యతలు తీసుకోవడం జరిగింది. ఇంతకుముందు మహబూబ్నగర్ జిల్లా వీఆర్ నుంచి బదిలీపై ధన్వాడ SHOగా రావడం జరిగింది. ఇంతకు ముందు ఉన్న SI P రమేష్ మహబూబ్నగర్ వీర్‌కు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా నూతన SI గారు మాట్లాడుతూ... ధన్వాడ పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రజలందరికీ అందుబాటులో ఉంటూ శాంతి భద్రతలు పరిరక్షించడానికి కృషి చేస్తానని అలాగే చట్ట వ్యతిరేక కార్యకలాపాలు నిర్వహించే వారిపై చట్టరీత్యా కఠినంగా వ్యవహరించడం జరుగుతుందని SI గారు తెలిపారు.

షార్ట్ సర్క్యూట్ తో ఇల్లు దగ్ధం



క్రిష్ణా : షార్ట్ సర్క్యూట్ కారణంగా బుధవారం అగ్ని ప్రమాదం సంభవించి మండలంలోని ఆలంపల్లి గ్రామంలో చెన్నబసప్ప గౌడకు చెందిన ఇల్లు దగ్ధమైంది. స్థానికులు తెలిపిన ప్రకారం.. చిన్న బసప్ప గౌడ వారం క్రింద కుటుంబ సభ్యులతో ఇల్లు తాళం వేసి రాయచూర్ లో ఉంటున్నాడని బుధవారం తెల్లవారుజామున షార్ట్ సర్క్యూట్ తో ఇంట్లో నుంచి మంటలు అంటుకున్నాయని, ఉదయం ఎనిమిది గంటలకు పెద్ద ఎత్తున మం టలు రావడంతో స్థానికులు ఫైర్ ఇంజన్ కు కాల్ చేసి చెప్పడంతో ఫైర్ ఇంజన్ అధికారులు వెంటనే వచ్చి మంటలను ఆర్పించారని ఈ ప్రమాదంలో ఇల్లు మొత్తం కాలిపోయిందని ఇంట్లో ఉన్న బట్టలు సామగ్రితతో పాటు విలువైన పత్రాలు కూడా కాలిపోయినట్లు, స్థానికులు తెలిపారు, ఇంకా పూర్తి సమాచారం తెలియవలసి ఉంది.

బస్సు నడపాలని డీఎంకు వినతి

ఊట్కూర్ : ఊట్కూర్ మీదుగా వయా పులిమామిడి,హైదరాబాద్ బస్సును పునరుద్ధరించాలని టీవీవీ జిల్లా సమన్వయకర్త బిజ్వార్ మహేష్ గౌడ్ కోరారు. బుధవారం నారాయణపేట ఆర్టీసీ డిపో వారు నిర్వహించిన డయల్ యువర్ డీఎం కు ఫోన్ చేసి సమస్యను వివరించారు. దాదాపు 7 నెలల కిందట ఉదయం పూట ఏడున్నర గంటలకు నారాయణపేట డిపో నుంచి బయలుదేరి ఊట్కూర్ మీదుగా బిజ్వార్, పులిమామిడి జక్లేర్ మీదుగా హైదరాబాద్ కు బస్సు నడిచేదని తెలిపారు. ప్రయాణికుల సౌకర్యార్థం తిరిగి సర్వీసులను ప్రారంభించాలని విజ్ఞప్తి చేశారు. దీనికిగాను ఆర్టీసీ డిపో మేనేజర్ లక్ష్మీ సుధా సమాధానం ఇస్తూ ప్రపోజల్ పంపిస్తామని కొత్త బస్సులు వచ్చిన వెంటనే పునరుద్ధరిస్తామని సమాధానం ఇచ్చారు.

నారాయణపేట ఎస్సైగా ఏ.వెంకటేశ్వర్లు



నారాయణపేట టౌన్ : నారాయణపేట పోలీస్ స్టేషన్ నూతన ఎస్ హెచ్ ఓ గా ఎస్సై ఏ.వెంకటేశ్వర్లు బుధవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఇంతకు ముందు మహబూబ్ నగర్ రూరల్ పోలీస్ స్టేషన్ ఎస్సై గా విధులు నిర్వర్తించి బదిలీపై నారాయణపేట ఎస్ హెచ్ ఓ గా వచ్చారు. ఇంతకుముందు నారాయణపేట ఎస్సైగా పనిచేసిన విజయ్ కుమార్ మహబూబ్‌నగర్ రూరల్ పోలీస్ స్టేషన్ కు బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా నూతన ఎస్ఐ ఏ.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ నారా యణపేట పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రజలందరికీ అందుబాటులో ఉంటానని పోలీస్ స్టేషన్ కు వచ్చే పిర్యాదుదారులకు సమన్వయం అందిస్తూ, సమస్యలు పరిష్కరిస్తూ, శాంతి భద్రతలు పరిరక్షించడానికి కృషి చేస్తానని, చట్ట వ్యతిరేక కార్యకలాపాలు నిర్వహించే వారిపై చట్టరీత్యా కఠినంగా వ్యవహరించడం జరుగుతుందని తెలిపారు.

దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేద్దాం : సీఐటీయూ

- మధ్యాహ్న భోజన కార్మికసంఘం నాయకులు



నవ తెలంగాణ - నారాయణపేట టౌన్

ఫిబ్రవరి 16న దేశవ్యాప్తంగా జరుగు సమ్మె , గ్రామీణ భారత్ బంద్ లో మధ్యాహ్న భోజన కార్మికులు కూడా పాల్గొంటున్నారని సీఐటీయూ జిల్లా కార్యదర్శి బలరాం తెలిపారు. నారాయణపేట జిల్లా విద్యాధికారి కార్యాలయ సూపరింటెంట్ నరసింహారెడ్డి కి సీఐటీయూ జిల్లా కార్యదర్శి బాల్ రామ్ ,మధ్యాహ్న బోజన పథకం కార్మికుల యూనియన్ జిల్లా కార్యదర్శి వెంకటయ్యలు సమ్మెకు సంబంధించిన అవినీతి పత్రాన్ని (నోటీసు) అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మధ్యాహ్న భోజన కార్మికుల బిల్లులు గత తొమ్మిది నెలల నుంచి పెండింగ్లో ఉన్నాయని వాటిని వెంటనే విడుదల చేయాలని కోరారు. మధ్యాహ్నం భోజనం పథకం లో పనిచేస్తున్న కార్మికులను కార్మికులుగా గుర్తించి కనీస వేతనం రూ. 26 వేలు ఇవ్వాలని, కోడి గుడ్లను ప్రభుత్వమే సరఫర చేయాలన్నారు. కార్మికులకు నష్టం కలిగించే కేంద్ర ప్రభుత్వం కార్మికులకు నష్టం కలిగించే నాలుగు కార్మిక కోడ్లను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఫిబ్రవరి 16న జరిగే దేశవ్యాప్త సమ్మె ను నారాయణపేట జిల్లాలోని మధ్యాహ్న భోజన కార్మికులందరూ పాల్గొని విజయవంతం చేయాలని కార్మికులను కోరారు. ఫిబ్రవరి 16న పాఠశాలలో వంట బంద్ ఉంటుందని తెలిపారు. సమ్మె నోటీసు అందజేసిన వారిలో మధ్యాహ్న భోజన కార్మిక సంఘం నాయకురాలు మహదేవమ్మ , యాదమ్మ , శివలీల తదితరులు పాల్గొన్నారు.

బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు కృషి చేయాలి : ఎస్పీ



నారాయణపేట టౌన్ : బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయలని ఎస్పీ యోగేష్ గౌతమ్ అన్నారు. బుధవారం ఆపరేషన్ స్మైల్ 10 ముగింపు సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆపరేషన్ స్మైల్ 10 కార్యక్రమం జనవరి 1 నుంచి 31 వరకు రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించడం జరిగిందని అన్నారు. నారాయణపేట జిల్లాలో ఈ నెల రోజులలో 64 మంది బాల కార్మికులను పట్టుకోవడం జరిగిందని, అందులో 46 బాలురు, 18 బాలికలు ఉన్నట్లు తెలిపారు. 11 బాల కార్మికుల యజమానులపై ఎఫ్ ఐ ఆర్ నమోదు చేయడం జరిగిందని, మిగితా బాల కార్మికుల తల్లిదండ్రులను పిలిపించి వారికి కౌన్సిలింగ్ ఇచ్చి మళ్లీ ఇంకోసారి బాల కార్మికులుగా పిల్లలను పని చేయిస్తే తల్లిదండ్రులపై కేసులు నమోదు చేయడం జరుగుతుందని తెలిపారు.జిల్లాలో 18 సంవత్సరాల లోపు పిల్లలు బాలకార్మికులుగా పని చేస్తున్న వ్యవసాయ పనుల్లో ఉన్న, గొర్రెల, పశువుల కాపరులుగా, కిరాణం షాపులలో, మెకానిక్ షాపులలో, హోటళ్లలో కార్మికులుగా పని చేస్తున్న, పిల్లలు రోడ్డుపై భిక్షాటన చేస్తున్న, ఇటుక బట్టీలలో, పౌల్ట్రీ ఫామ్లలో, మరే ఇతర ప్రదేశాలలో ఉన్న తప్పిపోయిన/ వదిలివేయబడిన, పిల్లలు బాల కార్మికులుగా పని చేస్తున్న పిల్లలు ఉన్నట్లయితే అలాంటి వారిని, తల్లిదండ్రులు తమ తాత్కాలిక ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని పిల్లల భవిష్యత్తును నాశనం చేయరాదని సూచించారు. పిల్లల బంగారు భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకొని బడికి పంపించాలని, తల్లిదండ్రులు అయిన సరే తమ పిల్లలను బడి మాన్పించి పనులకు ఉపయోగిస్తే అది నేరంగా పరిగణించబడుతుందని, అట్టి వారి పై కూడా కేసులు నమోదు చేయడం జరుగుతుందని అన్నారు. నారాయణపేట జిల్లాలో బాల కార్మికులు లేకుండా ప్రజలందరూ సమిష్టిగా కృషి చేయాలని తెలిపారు. చిన్నపిల్లలు వెట్టిచాకిరికి గురికాకుండా వారి మొహంలో చిరునవ్వులు చిందించేలా ప్రతి ఒక్కరూ తమ కర్తవ్యాన్ని నిర్వర్తించాలని, జిల్లాలో ఎవరైనా బాలకార్మికులను పనిలో పెట్టుకున్న బాలలను చూసినప్పుడు, ఆశ్రయం అవసరమైన బాలలను చూసినప్పుడు, తప్పిపోయిన మరియు వదిలివేయబడిన బాలలను చూసినప్పుడు, శారీరకంగా మానసిక, లైంగిక దోపిడీకి గురవుతున్న బాలలను చూసినప్పుడు, ఆర్థికంగా దోపిడీకి గురవుతున్న బాలకార్మికులను చూసినప్పుడు, హింసకు బెదిరింపులకు గురవుతున్న వీధి బాలలను చూసినప్పుడు, సంబంధిత పోలీసు అధికారులకు మరియు 1098 లేదా డయల్ 100, ఫోన్ చేసి సమాచారం అందించాలని ఎస్పీ సూచించారు. సమాచారం అందించిన వారి పేర్లను గోప్యంగా ఉంచుతామన్నారు. బాలకార్మిక వ్యవస్థను నిర్మూలించడానికి ఆపరేషన్ స్మైల్ -10 బృందంలో పని చేసిన పోలీసులను, వివిధ డిపార్మెంట్ అధికరులందరిని ఎస్పీ అభినందించారు.

పదేళ్లలో పాలమూరుకు న్యాయం జరగలేదు

- సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితులు వంశీచంద్ రెడ్డి



క్రిష్ణా : తెలంగాణ రాష్ట్రం ఏర్పాటయ్యాక పది సంవత్సరాలు అధికారంలో ఉన్న పాలకులు, పాలమూరు జిల్లాను అభివృద్ధి పరంగా పూర్తిగా నిర్లక్ష్యం చేశారని సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితులు వంశీచంద్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. కేవలం తమ సొంత రాజకీయాల ప్రయోజనాల కోసం తప్ప జిల్లాను పట్టించుకోలేదని ఆయన ఆరోపించారు. బుధవారం నారాయణపేట జిల్లా క్రిష్ణా మండలం నుంచి పాలమూరు న్యాయ యాత్ర పేరుతో వంశీచంద్ రెడ్డి శ్రీకారం చుట్టిన మహబూబ్నగర్ పార్లమెంటు నియోజకవర్గంలో నిర్వహించనున్న పాదయాత్ర ప్రారంభోత్సవంను మండల కేంద్రంలోని క్షీరలింగేశ్వర స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి తదనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్ర స్ఫూర్తితో నిర్వహిస్తున్న ఈ పాలమూరు న్యాయ యాత్ర ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో మూడు రోజులపాటు రోజుకు 20 కిలోమీటర్ల చొప్పున కొనసాగుతుందని ఆయన పేర్కొన్నారు, గత అసెంబ్లీ ఎన్నికల్లో మహబూబ్ నగర్ పార్లమెంటు నియోజకవర్గం అన్ని అసెంబ్లీ సీట్లను అందరి సహకారంతో గెలిపించుకున్నామని అదే స్ఫూర్తితో మహబూబ్ నగర్ పార్లమెంటు నియోజకవర్గంలోని రైతులకు మహిళలకు ఉద్యోగులకు అందరికీ మేలు జరిగే విధంగా పాలమూరు పార్లమెంటు నియోజకవర్గ ప్రగతి పథంలో అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టాలనే ఉద్దేశంతో పాలమూరు న్యాయ యాత్ర పేరుతో మహబూబ్నగర్ పార్లమెంటు నియోజకవర్గం పరిధిలో ఉన్న ఏడు అసెంబ్లీ నియోజకవర్గంలో పాదయాత్ర నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. పాలమూరు జిల్లాను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహకారంతో ఎమ్మెల్యేల నేతృత్వంలో జిల్లాను అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామని వంశీచంద్ రెడ్డి చెప్పారు. అనంతరం వంశి చంద్ రెడ్డి నిర్వహించనున్న పాదయాత్రను నారాయణపేట జిల్లా జడ్పీ చైర్మన్ వనజమ్మ, మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి, నారాయణపేట ఎమ్మెల్యే పర్ణిక రెడ్డి, డిసిసి అధ్యక్షులు ప్రశాంత్ కుమార్ రెడ్డి దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి కార్యక్రమంలో పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని జెండా ఊపి ప్రారంభించారు.

త్వరలోనే నారాయణపేట- కొడంగల్ ఎత్తిపోతల పథకం

నారాయణపేట జిల్లా ప్రజలకు సాగునీటి వనరులను కల్పించే దశాబ్దాల కల అయిన నారాయణపేట- కొడంగల్ ఎత్తిపోతల పథకం త్వరలోనే చేపట్టేందుకు చర్యలు జరుగుతున్నాయని వంశిచంద్ రెడ్డి అన్నారు, ఇందుకోసం ఇటీవలే ఎమ్మెల్యేలతో కలిసి రాష్ట్ర సాగునీటి మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తో పాటు సంబంధిత అధికారులతో చర్చించామని త్వరలోనే నారాయణపేట జిల్లా ప్రజలకు శుభవార్త వినిపిస్తామని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా మక్తల్ నియోజకవర్గం సంగ బండ రిజర్వాయర్ భూ నిర్వాసితులకు అందవలసిన పరిహారం ఇప్పించేందుకు చర్యలు చేపడతామని వంశీచంద్ రెడ్డి చెప్పారు.

రజకులను ఆదుకోవాలి



నారాయణపేటటౌన్ : రజక వృత్తిదారుల అభివృద్ధికి ప్రభుత్వం ఆదుకోవాలని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పైళ్ల ఆశయ్య బుధవారం నారాయణపేట రజక వృత్తి దారుల 2024 క్యాలెండర్ ను నారాయణపేట రజక కమిటీ హాల్ నందు కడెం పల్లి వెంకట్రాములు అధ్యక్షతన ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన తెలంగాణ రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పైళ్ళ ఆశయ్య హాజరై మాట్లాడుతూ రాష్ట్రంలో 10 లక్షల మందికి పైన రజకులు రజక వృత్తి పై ఆధారపడి జీవిస్తున్నారని, రజకులు ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వృత్తిదా రుల ఆర్థిక అభివృద్ధికి ప్రభుత్వం పూనుకోవాలని రజక వృతుల ఆధునికర ణ, ఉపాధి కల్పించడానికి ప్రభుత్వం ప్రత్యేక బడ్జెట్ ఇచ్చి ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వ హాస్పిటల్, గురుకులలో కులవృత్తి పనిని రజక వృత్తిదారులకు ఇచ్చే విధంగా ప్రభుత్వం జీవో విడుదల చేయాలని కోరారు.ఇందిరమ్మ ఇళ్ల పథ కంలో వృత్తిదారులకు ప్రథమ ప్రాధాన్యత ఇవ్వాలి, రజక ఫెడరేషన్ కు వెంటనే పాలకవర్గం నియమించి ప్రతి కుటుంబానికి రూ.10 లక్షల ఆర్థిక సహకారం అందించే విధంగా ప్రభుత్వం ముందుకు రావాలని కోరారు. రజకులపై జరిగే దాడులు, దౌర్జన్యాలు అరికట్టడానికి ప్రత్యేక రక్షణ చట్టం చేయాలని కోరారు. జిల్లా చేతి వృత్తిదారుల కన్వీనర్ ఉడమలగిద్ద గోపాల్ రజక వృత్తిదారుల సంఘం జిల్లా కన్వీనర్ కడెంపల్లి రఘు, జిల్లా నాయకురాలు లలితమ్మ శానప్ప ,బాలప్ప రాజు, నరసింహులు, శేషు లోకేష్ ,బి రాజు తదితరులు పాల్గొన్నారు.

వాల్ పోస్టర్ల ఆవిష్కరణ



నారాయణపేట టౌన్ : నారాయణపేట జిల్లా రవాణా శాఖ ఆధ్వర్యంలో 2024 జనవరి 15వ తేదీ నుండి ఫిబ్రవరి 14 వ తేదీ వరకు ప్రజలకు తెలిసే విధంగా రోడ్డు భద్రత వారోత్సవాలు నిర్వహించడం జరుగుతుందని ఎస్పీ యోగేష్ గౌతమ్ తెలిపారు. జిల్లా రవాణా శాఖ ద్వారా రోడ్డు భద్రత వారోత్సవాలు నిర్వహిస్తున్న వాల్ పోస్టర్ ను,కరపత్రాలను ఎస్పీ యోగేష్ గౌతమ్ జిల్లా పోలీసు కార్యాల యంలో బుధవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ యోగేష్ గౌతమ్ మాట్లాడుతు జిల్లా రవాణా శాఖ ద్వారా నిర్వహిస్తున్న రోడ్డు భద్రత వారోత్సవాల పై జిల్లాలో అన్ని పోలీసు స్టేషన్ పరిధిలో ప్రతిచోట ప్రతి ప్రాంతంలో ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించి రోడ్డు ప్రమాదాలు నివారించడానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని తెలిపారు. రోడ్డు భద్రత నియమాలపై ప్రజలకు, వాహనదారులకు తెలియజేయాలని అన్నారు. పోలీస్ స్టేషన్ల పరిధిలో వాల్ పోస్టర్ల ద్వారా కరపత్రాల ద్వారా ప్రచారం చేయాలని అధికారులకు ఎస్పి ఆదేశాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డిసిఆర్బి డిఎస్పి వెంకటేశ్వరరావు, మోటార్ వెహికల్ అధికారి మెగా గాంధీ, వీరస్వామి, ఆర్ఐ శేఖర్ బాబు, అధికారులు తదితరులు పాల్గొన్నారు



ఫిబ్రవరి 16న ఆశా కార్యకర్తల సమ్మె

నారాయణపేటటౌన్ : ఫిబ్రవరి 16న దేశవ్యాప్తంగా సమ్మె గ్రామీణ బందులో భాగంగా మేము సైతం అంటూ ఆశా కార్యకర్తలు బుధవారం నారాయ ణపేట జిల్లా ఆస్పత్రిలోని పీపీ యూనిట్ సూపర్‌వైజర్ తబితా రాణి కి ఆశా కార్యకర్తలు సమ్మె నోటీస్ అందజేశారు. ఈ సందర్భంగా ఆశ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు బాలమణి మాట్లాడుతూ ఆశా వర్కర్లకు పారి తోషికం రద్దుచేసి కనీస వేతనం రూ.26 వేలు అమలు చేయాలని, ఎన్ఆర్హెచ్ఎం స్కీంకు బడ్జెట్ పెంచాలని, కేంద్ర ప్రభుత్వం తెచ్చిన కార్మిక వర్గానికి నష్టం కలిగించే నాలుగు కార్మిక కోడ్లు రద్దు చేయలన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీదేవి, మమత, భాగ్యమ్మ, సునీత, నర్మద, రాధిక, మహేశ్వరి, ఉమా పాల్గొన్నారు.

వైద్యుల నియామకం పై సమీక్ష

- అదనపు కలెక్టర్ మయాంక్ మిట్టల్



నారాయణపేటటౌన్ : నారాయణపేట జిల్లాకు మంజూరైన మెడికల్ కళాశాలలో వైద్యుల నియామకంపై జిల్ల అదనపు కలెక్టర్ మయాంక్ మిత్తల్ బుధవారం కలెక్టరేట్ కార్యాలయ వీడియో కాన్ఫరెన్స్ హాలులో సమీక్షించారు. జిల్లాకు చెందిన వైద్యులతో అదనపు కలెక్టర్ మాట్లాడుతూ మెడికల్ కాలేజీ లో పని చేసేందుకు ఎంతమందికి ఆసక్తి ఉందని డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. జిల్లా ఆసుపత్రిలో విధులు నిర్వర్తిస్తూ మెడికల్ కాలేజీలో పని చేసేందుకు వీలు అవుతుందా ? లేదా ! అని డాక్టర్లను అడిగారు. ఆసక్తి లేకపోతే కొత్త వైద్య సిబ్బందిని రిక్రూట్మెంట్ చేయాల్సి ఉంటుందన్నారు. ఈ విషయంలో జిల్లాకు చెందిన ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రుల డాక్టర్లు తమ అభిప్రాయం చెప్పాలన్నారు. దీనిపై సమావేశంలో పాల్గొన్న డాక్టర్లు తమకు కొంత సమయం ఇస్తే ఆలోచించుకుని తమ నిర్ణయం చెబుతామని అదనపు కలెక్టర్‌కు తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రంజిత్ కుమార్, మెడికల్ కాలేజ్ ప్రిన్సిపాల్, జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రు ల డాక్టర్లు పాల్గొన్నారు.

మండలంలో పాలమూరు న్యాయ యాత్ర

ఊట్కూర్ : ఊట్కూర్ మండలంలోని పెద్ద జట్రం గ్రామంలో సీడబ్ల్యూసీ సభ్యులు చల్ల, వంశీచందర్ రెడ్డి , మన మక్తల్ శాసనసభ్యులు వాకిటి శ్రీహరి ఆధ్వర్యంలో ప్రారంభమవుతుందని అక్కడి నుంచి అవుస లోని పల్లి, బిజ్వార్, పులి మామిడి, గ్రామాల మీదుగా పాదయాత్ర చేసుకుంటూ, పులిమామిడి గ్రామంలో కార్నర్ మీటింగ్ ఉంటుందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు విగ్నేశ్వర్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ ఊట్కూర్ టౌన్ అధ్యక్షులు లింగం బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు ప్రజలు సీనియర్ కాంగ్రెస్ నాయకులు యూత్ కాంగ్రెస్ కార్యకర్తలు అందరూ హాజరై విజయవంతం చేయాలన్నారు

ఎస్ హెచ్‌ఓగా బాధ్యతలు తీసుకున్న ఎస్సై



మరికల్ : మరికల్ నూతన ఎస్ హెచ్‌ఓగా కే.మురళి బాధ్యతలను బుధవారం తీసుకున్నారు. ఇంతకు ముందు ఈయన వనపర్తి జిల్లా మదనాపురం పోలీస్ స్టేషన్ నుండి బదిలీపై మరికల్ కు రావడం జరిగింది. ఇంతకు ముందు ఎస్ హెచ్‌ఓ గా విధులు నిర్వర్తించిన ఎస్సై సీహెచ్ హరిప్రసాద్ రెడ్డి నారాయణపేట ఎస్పీ కార్యాలయానికి బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా లినూతన ఎస్సై కే.మురళిలి మాట్లాడుతూ మరికల్ మండల ప్రజలకు అందుబాటులో ఉంటూ, శాంతి భద్రతలు సంరక్షించడానికి కృషి చేస్తానని అన్నారు. ప్రజల సమస్యలు పరిష్కరించడం జరుగుతుందని, అత్యవసర సమయంలో ప్రజలు పోలీసులను సంప్రదించాలని కోరారు.

దివ్యాంగులకు ఐదు శాతం రాజకీయ రిజర్వేషన్ కల్పించాలి

- రాష్ట్ర అధ్యక్షుడు నాగేష్ గౌడ్

ఊట్కూర్ : నేటి నుంచి ప్రారంభమైన పార్లమెంట్ సమావేశాల్లో వికలాంగులకు ఐదు శాతం రాజకీయ రిజర్వేషన్ కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలపాలని ప్రధాన ప్రతిపక్ష పార్టీలు కూడా సహకరించాలని వికలాంగుల రాజ్యాధికార సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు నాగేష్ గౌడ్ బుధవారం ఒక ప్రకటనలో కోరారు. దేశ జనాభాలో 20 శాతం ఉన్న దివ్యాంగుల గురించి ఏ ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదు దివ్యాంగుల గురించి చట్టసభలో ప్రశ్నించే నాథుడే కరువైపోయారని ఆరోపించారు దేశ జనాభాలో 20 శాతం ఉన్న మాకు రిజర్వేషన్ లేకపోవడం వల్ల ప్రభుత్వ పథకాలకు ఎంతో దూరంగా ఉంటున్నామన్నారు.ఉద్యోగ రిజర్వేషన్లు లేక ఉపాధిరిజర్వేషన్లు లేక బతుకులు అన్నమో రామచంద్ర అన్న తీరుగా మారిందన్నారు మా జీవితాలు బాగుపడాలంటే చట్టసభల్లో మా గురించి అడిగే వాళ్ళు ఉండాలని అభిప్రాయం వ్యక్తం చేశారు ఈ పార్లమెంట్ సమావేశంలో తప్పకుండా మాకు ఐదు శాతం రాజకీయ రిజర్వేషన్ కొరకు అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని ఆమోదం తెలపాలని డిమాండ్ చేశారు

పాలమూరు న్యాయా యాత్రకు మద్దతు

ఊట్కూర్ : పాలమూరు న్యాయా యాత్రకు మద్దతుగా ఊట్కూర్ మండలం కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొని న్యాయ యాత్ర చేపట్టారు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు విగ్నేశ్వర్ రెడ్డి కాంగ్రెస్ నాయకులు ఎల్కోటి నారాయణరెడ్డి ఎల్కోటి లక్ష్మీ కాంత్ రెడ్డి జనార్ధన్ రెడ్డి మోహన్ రెడ్డి చిన్న పొర్ల గ్రామ కాంగ్రెస్ నాయకులు మొహమ్మద్ హుస్సేన్ ప్రశాంత్ ఓ బ్లా పూర్ గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు వెంకటేష్‌గౌడ్‌తో పాటు వివిధ గ్రామాల నాయకులు , కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

